# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

30 ఏళ్ళ ప్రస్థానం వార్త వార్షికోత్సవం 1996 - 2026




శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం ధ్వజానికి గరుడుని పటం కడుతున్న దృశ్యం

## సపరివార దేవతలను ఆహ్వానిస్తూ!

తిరుమల,సెప్టెంబర్ 15 ప్రభాతవార్తప్రతినిధి: తొమ్మిది రోజులుపాటు జరగనున్న శ్రీనివాసుడి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాల విజయవంతానికి సకలదేవతా మూర్తులను ఆహ్వానిస్తూ మంగళవారం సాయంత్రం గరుడుని పటం ఊరేగించారు. గరుడుని చిత్రాన్ని ధ్వజస్తంభం మీద కట్టేందుకు నూలుతో చేసిన కొడి తాడును సిద్ధం చేశారు. ఉత్సవమూర్తులైన మలయప్పస్వామి, శ్రీదేవి భూదేవుల సమక్షంలో గోధూళి లగ్నమైన మీనలగ్నంలో కొడితాడుకు కట్టి నూతన కేతనాన్ని వేదపండితులు వేదమంత్రాలతో,మంగళవాద్యాలతో సాయంత్రం ధ్వజ స్తంభం పై ఎగురవేశారు. దీంతో దేవదేవుని బ్రహ్మోత్సవాలకు ఆరంభం జరిగింది. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, బోర్డు సభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, జ్యోతుల నెహ్రూ, పనబాకలక్ష్మి, సుచిత్ర ఎల్ల, టిటిడి ఈఓ ముద్దాడ రవిచంద్ర, జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి దంపతులు, కంకణభట్టర్ వెంకటరాఘవ దీక్షితులు, ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు, ఆలయ పారుపత్తేదార్ హిమత్‌గిరి, సిపిఆర్‌వో తలారి రవి లు పాల్గొన్నారు.

## పెద్ద శేషునిపై ... శ్రీమన్నారాయణుడు

### -బ్రహ్మోత్సవాల్లో తొలివాహనం ఆరంభం

తిరుమల, సెప్టెంబర్27 ప్రభాతవార్తప్రతినిధి :కలియుగవైకుంఠం తిరుమలలో సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాల్లో సాక్షాత్తు శ్రీమహావిష్ణువు అలంకారంలో శ్రీమన్నా రాయణుడు ఏడుతలల పెద్దశేషునిపై భక్తులకు కటాక్షించాడు. బ్రహ్మోత్సవాల్లో మొదటిరోజు మంగళవారం రాత్రి శ్రీదేవి భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామివారు ఏడుతలల స్వర్ణ శేషవాహనంపై తిరుమాడ వీధులలో విహరిం చారు. తొలిరోజు రాత్రి 9 గంటల నుంచి 11గంటల వరకు భక్తులకు దర్శన మిచ్చారు. భక్తుల గోవింద నామస్మరణలతో తిరుమలగిరులు మారుమోగాయి. శేషవాహనాన్ని దర్శిస్తే దుష్టశక్తుల వల్ల కలిగే దుష్ఫలితాలు తొలగి భక్తులకు కుండలినీయోగ సిద్ధించి సుఖశాంతులతో ఆనందజీవులవుతారని విశ్వాసం. ఈవాహనసేవలో పెద్దజీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి,ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్రమంత్రులు,టిటిడి అధికారులు పాల్గొన్నారు.



పెద్ద శేషవాహనంపై వున్న దేవదేవునికి మొక్కుతున్న ముఖ్యమంత్రి దంపతులు

## దేశంలోనే ఇతర ఆలయాలకూ...స్ఫూర్తి టిటిడి

### -భక్తులకు చక్కని దర్శన భాగ్యాన్ని కల్పించాలి : ముఖ్యమంత్రి

తిరుమల,సెప్టెంబర్ 15 ప్రభాతవార్తప్రతినిధి: దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ మారాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖ సంపదలతో సుభిక్షంగా ఉండాలని శ్రీవేంకటేశ్వర స్వామిని కోరుకున్నానని సిఎం చంద్రబాబునాయుడు తెలిపారు. శ్రీవేంకటేశ్వరస్వామి అంటే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందువులందరికీ అపారమైన నమ్మకమని, శ్రీవారి ఆలయాన్ని చక్కగా నిర్వహిస్తున్న పాలక మండలి, అధికారులకు అభినందనలు తెలియచేస్తున్నా నన్నారు. తిరుమలలో క్రమశిక్షణతో కూడిన ఆలయ నిర్వహణ దేశంలోని ఇతర ఆలయాలకూ స్ఫూర్తి ప్రపంచ వ్యాప్తంగా, దేశ వ్యాప్తంగా ఉన్న హిందువులు ఒక్కసారైనా శ్రీవారిని దర్శించుకోవాలని కోరుకుంటారని సిఎం తెలిపారు. రాబోయే నూతన ఆంగ్ల సంవత్సర 2027క్యాలండర్లు, డైరీలను మంగళవారం రాత్రి పట్టువస్త్రాలు సమర్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారాలోకేశ్ చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, బోర్డు సభ్యులు, మంత్రులు, టిటిడి ఈఓ ముద్దాడ రవిచంద్ర, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరిలు పాల్గొన్నారు.





## ఇష్ట దైవానికి...పట్టువస్త్రాలు

### -సిఎం చంద్రబాబు దంపతులు సమర్పణ

తిరుమల,సెప్టెంబర్ 15ప్రభాతవార్తప్రతినిధి: ఇష్టదైవమ్ తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాలలో తొలిరోజైన మంగళవారం రాత్రి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దంపతులు రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించారు. తోలుత ముఖ్యమంత్రి దంపతులు బేడి ఆంజనేయ స్వామివారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అనంతరం బేడి ఆంజనేయ స్వామి వారి ఆలయం నుండి మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయంలోపల పట్టు వస్త్రాలను సమర్పించారు. శ్రీవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. 2027 సంవత్సరం క్యాలండర్లు, డైరీలను ఆవిష్కరించారు. అంతకుముందు టిటిడి ఛైర్మన్ బి.ఆర్ నాయుడు, ఈఓ ముద్దాడ రవిచంద్ర స్వాగతం పలికారు. ఆలయంలో ధ్వజ స్తంభానికి నమస్కరించుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. శ్రీ వేంకటేశ్వర స్వామివారి కళంకారీ చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, బోర్డు సభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, జ్యోతుల నెహ్రూ, పనబాకలక్ష్మి, సుచిత్ర ఎల్ల, టిటిడి ఈఓ ముద్దాడ రవిచంద్ర, జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలదీక్షితులు, ఆలయ పారుపత్తేదార్ హిమత్‌గిరి, సిపిఆర్‌వో డాక్టర్ తలారి రవి తదితరులు పాల్గొన్నారు.

## సాగర్లో నిమజ్జనానికి ఏర్పాట్లు పక్కాగా చేపట్టండి

### - ఏర్పాట్లు పరిశీలించిన కమిషనర్ ఎం.జయకృష్ణ



తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: వినాయక సాగర్ లో జరగనున్న నిమజ్జనానికి కావలసిన అన్ని ఏర్పాట్లను పక్కాగా చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ అధికారులకు ఆదేశించారు. వినాయక విగ్రహాల నిమజ్జనానికి వినాయక సాగర్ లో జరుగుతున్న ఏర్పాట్లను సోమవారం రాత్రి కమిషనర్ పరిశీలించారు. మొదటి రోజు నిమజ్జనానికి వచ్చిన విగ్రహాల నిమజ్జనంను పరిశీలించారు. నిమజ్జనానికి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లను జాగ్రత్తగా చేయాలని తెలిపారు. పారిశుద్ధం మెరుగ్గా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. విగ్రహాలను తీసుకు వచ్చే మార్గాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఎక్కడికక్కడ తగు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. సాగర్లో నీటిలో చెత్త లేకుండా ఎప్పటికప్పుడు తొలగించి శుభ్రంగా ఉంచాలని తెలిపారు. తెప్పలపైన గజ ఈతగాళ్ళను ఉంచి ఎటువంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. విగ్రహాల నిమజ్జనానికి వినియోగించే క్రేన్ల కండిషన్‌ను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలని అధికారులకు సూచించారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని తెలిపారు. మూడవ రోజు మరిన్ని ఎక్కువ విగ్రహాలు వచ్చే అవకాశం ఉన్నందున మరింత అప్రమతంగా ఉండాలని అధికారులకు సూచించారు. కమిషనర్ వెంట టీటిడి బోర్డు సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్, డి.ఈ. రమణ, నిమజ్జన కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్, సభ్యులు ఆర్. సి. మునికృష్ణ, గుండాల గోపి, తదితరులు ఉన్నారు.

## రాజకీయ చదరంగంలో... తిరుపతి మేయర్ ఎన్నిక!

### -భూమనకు చెక్ పెట్టేందుకు కూటమి వ్యూహం!?

ప్రభాతవార్త-తిరుపతి:




తిరుపతి మేయర్ ఎన్నిక రాజకీయ చదరంగాన్ని తలపిస్తోంది. కూటమి నేతల ఎత్తులకు వైసిపి పై ఎత్తులు వేయాలని భావిస్తున్న నేపథ్యంలో అభ్యర్థుల ఎంపిక చుట్టూ సామాజిక, రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. వైసిపి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డిని రాజకీయంగా ఇరుకున పెట్టే వ్యూహంపై కూటమి వర్గాల్లో చర్చ జరుగుతున్నట్లు తెలుస్తోంది.

గత డిప్యూటీ మేయర్ ఎన్నికల సమయంలో అప్పటి పరిస్థితులను అనుకూలంగా మలుచుకుని, ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ సహకారంతో పలువురు కార్పొరేటర్లను తమవైపు ఆకర్షించి, ఏకైక టిడిపి కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణను డిప్యూటీ మేయర్‌గా గెలిపించడాన్ని కూటమి వ్యూహాత్మక విజయంగా భావిస్తోంది. ఈ వ్యవహారంలో కీలకంగా వ్యవహరించిన అన్నా అనితను పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమించడం కూడా రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.ఇక కరుణాకర్ రెడ్డికి దీటుగా రాజకీయంగా ఎదిరించేందుకు జె.బి. శ్రీనివాస్‌కు నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడం కూడా తిరుపతి రాజకీయాల్లో ఆసక్తికర పరిణామంగా మారింది. 2021లో జనరల్ మహిళకు మేయర్ పదవి కేటాయించిన సమయంలో భూమన కరుణాకర్ రెడ్డి యాదవ సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ ఆర్. శిరీషా యాదవ్‌ను మేయర్‌గా ఎంపిక చేశారు. అప్పట్లో టిడిపికి సంప్రదాయంగా ఉన్న యాదవ ఓటు బ్యాంకును ఆకర్షించడంతో బాటు, సామాజిక సమీకరణాలను బలోపేతం చేయాలనే రాజకీయ లెక్కలు కూడా అందులో ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తమైంది.

ఇప్పుడు జరగనున్న మేయర్ ఎన్నికల్లో తిరిగి శిరీషా యాదవ్‌ను బరిలోకి దింపాలని భూమన వర్గం భావిస్తున్నట్లు సమాచారం. దీనికి ప్రత్యామ్నాయంగా టిడిపి కూడా యాదవ సామాజిక వర్గానికి చెందిన నాయకుల పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

మంత్రి అనగాని సత్యప్రసాద్ మద్దతుతో అన్నా అనితా యాదవ్ పేరు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. నియోజకవర్గ ఇన్‌చార్జి జె.బి. శ్రీనివాస్ నరసింహ యాదవ్, దంపూరి భాస్కర్ యాదవ్ పేర్లను కూడా సూచించినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.-రెడ్డి అభ్యర్థితో వైసిపికి గండి?:

ఇదే సమయంలో మరో రాజకీయ లెక్క తెరపైకి వచ్చింది. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థిని బరిలోకి దింపితే వైసిపికి ఉన్న సంప్రదాయ ఓటు బ్యాంకులో కొంత భాగాన్ని కూటమి వైపు మళ్లించే అవకాశం ఉంటుందనే అభిప్రాయం కొందరు కూటమి నాయకుల్లో వ్యక్తమవుతున్నట్లు తెలుస్తోంది.

ఈ నేపథ్యంలో డాక్టర్ ఎన్.బి. హర్షవర్ధన్ రెడ్డి పేరు కూడా పరిశీలనలోకి వచ్చినట్లు సమాచారం. యువత, విద్యావంతులు, సామాజిక సేవా రంగంలో చురుకుగా ఉన్న వ్యక్తిగా ఆయనకు ఉన్న గుర్తింపు కూడా అదనపు అంశంగా కొందరు నేతలు పరిగణిస్తున్నట్లు తెలుస్తోంది. అలాదే విధంగా మాజీ రాష్ట్ర నాయకులు మబ్బు దేవనారాయణ రెడ్డి, సూరా సుధాకర్‌రెడ్డి పేర్లు కూడా పరిశీలనలో ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. వైసిపి కూడా తనదైన రాజకీయ లెక్కలతో ముందుకు వెళ్లే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. బలిజ సామాజిక వర్గానికి చెందిన మాజీ మున్సిపల్ ఛైర్మన్ వి. మునిరత్నం కోడలు సునీతా పురందర్ పేరును పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఆమె కుటుంబానికి కూడా తిరుపతి రాజకీయాల్లో పాత అనుబంధం ఉంది. ఆమె మామ వెంకటమునిశెట్టి 1981లో తుడా ఛైర్మన్‌గా పనిచేశారు. ప్రస్తుత రాజకీయ సమీకరణాల్లో బలిజ సామాజిక వర్గం అంశం కూడా కీలకంగా మారింది. అందువల్ల మేయర్ అభ్యర్థి ఎంపికలో కేవలం వ్యక్తిగత బలం, రాజకీయ అనుభవం మాత్రమే కాకుండా సామాజిక సమీకరణాలు, కార్పొరేటర్ల మద్దతు, పార్టీ విధేయత, ప్రజాదరణ, ప్రత్యర్థి పార్టీ ఓటు బ్యాంకులోకి చొచ్చుకుపోయే సామర్థ్యం వంటి అంశాలు కీలకంగా మారనున్నాయి. చివరకు మేయర్ అభ్యర్థి ఎంపికే ఈ రాజకీయ చదరంగంలో తొలి కీలక ఎత్తుగా మారనుంది.

## కాణిపాకంలో... వైభవంగా ధ్వజారోహణం

### -శాస్త్రసోక్తంగా అంకురార్పణ



ధ్వజస్థంభం వద్ద మూషికపటానికి హారతులిస్తున్న అర్చకులు

కాణిపాకం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం ధ్వజారోహణం కార్యక్రమం అత్యంత వైభవోపేతంగా జరిగింది. ఆలయంలో ఈనెల 14 నుండి అక్టోబర్ 4 వరకు 21 రోజులుపాటు స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఇందులో భాగంగా తొమ్మిది రోజులు పాటు జరిగే నవరాత్రి బ్రహ్మోత్సవాలకు మంగళవారం అంకురార్పణ జరిగింది. ఈమేరకు ఉదయం స్వాతినక్షత్రం, శుభ కన్యాలగ్నం నందు ఉదయం 7.15 గంటల నుండి 8.15 గంటల



మధ్య ధ్వజారోహణం కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు బ్రహ్మాదిదేవతలను ఆహ్వానించేందుకు ధ్వజారోహణం చేయడం ఆనవాయితీ. దుష్ట శకునాలు తగలకుండా బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయడానికి అంకురార్పణ చేస్తారు. ఉదయం అర్చకస్వాములు ముందుగా స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలను నిర్వహించి ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. అనంతరం ప్రధాన ఆలయంలలోని నూతన బంగారు ధ్వజస్థంభం వద్ద విఘ్నేశ్వరపూజ, అనుజ్ఞ, స్థలశుద్ధి, పుణ్యాహావాచనం, వాస్తు శాంతి, నవసంధిబలి, కలశపూజ, మూషిక యాగం, ధ్వజపటపూజ, న్యాయాభిషేకం, భావనా భిషేకం నిర్వహించారు. అనంతరం బ్రహ్మోత్సవాలను దిగ్విజయంగా జరగడానికి, ఉత్సవాలకు బ్రహ్మాది దేవతలను ఆహ్వానిస్తూ బంగారు ధ్వజస్థంభంపై మూషికపటాన్ని ఎగురవేశారు. అనంతరం బంగారు ధ్వజస్థంభానికి పాలు, పెరుగు వంటి పలు రకాల సుగంధ ద్రవ్యాలతో పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం వేదపండితులు చతుర్వేద పారాయణం చేసి మరోమారు ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ మణినాయుడు, ఈఓ పెంచల కిషోర్, ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్, ఆలయ మాజీ ఛైర్మన్‌లు జగన్నాథరెడ్డి, ఉభయదారుల కమిటీ ఛైర్మన్ శివశంకరి, ఏఈఓ రవీంద్రబాబు,సూపరెండెంట్‌లు కోదండపాణి, వాసు, స్థానిక మాజీ సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఎంపీటీసీ సుధీర్, ఆలయ అధికారులు, అర్చకులు, వేదపండితులు భక్తులు పాల్గొన్నారు.

**ఆలయంలో శాస్త్రసోక్తంగా అంకురార్పణ:**

బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో అంకురార్పణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈమేరకు అర్చకులు గ్రామ సమీపంలో పుట్ట మన్ను సేకరించి మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రధాన ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలలో అంకురార్పణ గావించారు. ఈ యాగశాలలో నవరాత్రి దీక్షాహోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈసందర్భంగా అర్చక స్వాములు అష్టోత్తర కలశాలను (108) ఏర్పాటు చేసి పూజలు చేసి కలశస్థాపన, అగ్నిప్రతిష్టహోమం నిర్వహించారు. అనంతరం బ్రహ్మోత్సవాలను దిగ్విజయంగా నిర్వహించడానికి కంకణబద్ధులై ఆలయ ఈఓ పెంచల కిషోర్, అర్చకులు ఆచార్య రక్షాబంధనాన్ని ధరించారు.

## శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో... నిధుల దుర్వినియోగం

### -ఆడిట్‌తో అవినీతి బట్టబయలు-సూపరింటెండెంట్‌కు తెలియకుండానే జరిగిందా?



శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో భారీ ఎత్తున నిధుల కుంభకోణం జరిగినట్లు గుప్పు మంది. ఆడిట్ విభాగం ఈ కుంభకోణాన్ని బట్టబయలు చేసింది. అయితే ఉన్నతాధికారులు తప్పించుకొనుటకు కింది స్థాయి చిరుద్యోగుల్ని బలి చేసేందుకు రంగం సిద్దమైంది. దాంతో జనం ఈ తతంగం అంతా ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు తెలియకుండా జరిగిందా? అని చర్చించుకుంటున్నారు. సుమారు రూ.55లక్షలకు పైగా అవినీతి జరిగినట్లు సమాచారం.అయితే ఈ సంఘటనపై ఫిర్యాదు చేయటానికి ఆసుపత్రి సూపరింటెండెంట్ ఇటు టూ టౌన్ సిఐ వద్దకు డివైయస్‌పి వద్దకు మంగళవారం ఉదయం నుంచి చక్కర్లు కొడుతున్నారు. అయితే పోలీసులు తమకు అనుకూలంగా నివేదిక ఫిర్యాదు కావాలని కోరినట్లు సమాచారం.ఈ సంఘటనపై వివరణ కోరటానికి సూపింటెండెంట్‌ను వివరణ కోరటానికి ప్రయత్నించగా ఆయన ఫోన్లు తీయటం లేదు. ఉదయం నుంచి ఆసుపత్రిలో లేదు. ఇక టూటౌన్ సిఐ నాగరాజును వివరణ కోరగా ఫిర్యాదు పూర్తి స్థాయిలో ఇవ్వలేదని వివరణ ఇచ్చారు.

**అసలేం జరిగింది?**

శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ మందుల కొనుగోళ్ళకు సంబంధించి భారీ ఎత్తున నిధులు గోల్‌మాల్ జరిగినట్లు ఆడిట్ నివేదిక తేట తెల్లం చేసిందని తెలిసింది. ఈ నేపథ్యంలో సుమారు రూ.50లక్షలకు పైగానే ఉండవచ్చునని భావిస్తున్నారు. అయితే ఇంత పెద్ద మొతం గోల్ మాల్ జరిగితే ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మురళీ కృష్ణకు తెలియకుండా జరిగిందా? కొనుగోళ్ళను ఆయన సంతకాలు లేకుండా జరిగాయా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. శ్రీకాళహస్తీశ్వరాలయం నిర్మాణ కార్యక్రమాల్లో గత వైకాపా ప్రభుత్వంలో కుంభకోణం జరిగిందని అధికార పక్షం విమర్శలు కురిపిస్తున్న సమయంలో మందుల కొనుగోళ్ళలో గందరగోళం చోటు చేసుకోవటం చర్చనీయాంశంగా మారింది.

**ఆయనకు తెలియకుండానే కొనుగోళ్ళు జరిగాయా?**

శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో మందుల కొనుగోళ్ళకు సంబంధించి సూపరింటెండెంట్‌కు తెలియకుండానే కుంభకోణం జరిగిందా? ప్రతి అంశం మీద సూపరింటెండెంట్ సంతకం కావాలి కదా? మరి ఆయన తనకు తెలియకుండానే ఫైళ్ళ మీద సంతకాలు పెట్టారా? అనేది మరో అంశం. ఆసుపత్రి పాలనపై నిత్యం నిఘా ఉంచిన నాయకుల పాలనలో కూడా అవినీతి జరగటం చర్చనీయాంశంగా మారింది.ఈ అంశాలపై పైస్థాయి విచారణ జరపాల్సి ఉంది.

## తిరుమలలో తగ్గిన...భక్తుల రద్దీ

### - వినాయక చవితి వేడుకల్లో మునిగి తేలుతున్న భక్తజనం- వెలవెలబోయిన రైల్వే స్టేషన్, బస్టాండ్లు- ఖాళీగా తిరుగుతున్న ప్రత్యేక బస్సులు

తిరుపతి క్రైం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త : తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నప్పటికీ, తిరుమలకు భక్తుల రాక అనూహ్యంగా తగ్గింది. వినాయక చవితి పండుగ సందర్భాన్ని పురస్కరిం చుకుని భక్తుల సంఖ్య భారీగా తగ్గడం విశేషం. సాధారణంగా బ్రహ్మోత్సవాల సమయంలో తిరుమల గిరులు భక్తజనంతో కిక్కిరిసిపోతాయి. కానీ, ఈసారి పండుగ ప్రభావంతో భక్తులు తమ స్వగృహాల్లోనే ఉండి వేడుకలు జరుపు కోవడానికి మొగ్గు చూపినట్లు స్పష్టమవుతోంది. అధిక భక్తుల రీత్యా ఏర్పాటు చేసిన అదనపు 500 బస్సులతో పాటు మొత్తంగా మూడు వేల వంద ట్రిప్పులు తిరిగేలా ఆర్టీసీ ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసింది. అయితే ప్రత్యేక బస్సులే కాకుండా సాధారణంగా తిరిగే వాహనాలు కూడా ఖాళీగా తిరగడంతో తిరుమల బ్రహ్మోత్సవాల వేళ తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ వెలవెలపోతు దర్శనమిస్తున్నాయి. ఇదిలా ఉండగా గత మూడు రోజులలో రెండవ శనివారం ఆదివారం వినాయక చవితి సెలవులు కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. పెరిగిన రద్దీ బ్రహ్మోత్సవాల్లో సైతం కొనసాగుతుందని టిటిడి అధికారులు పూర్తిస్థాయిలో పటిష్ట బందోబస్తు తో పాటు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేశారు. అనూహ్యంగా భక్తులు వినాయక చవితి పండుగ సంబరాలలో మునిగిపోవడంతో శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భక్తులు రద్దీ సన్నగిలింది. మంగళవారం ఉదయం కేవలం నాలుగు కంపార్ట్మెంట్లు మాత్రమే భక్తులు ఉండడంతో సమాచారం తెలుసుకున్న స్థానికులు శ్రీవారి దర్శనానికి పయనం అవుతున్నారు. వెలవెలబోయిన ప్రధాన రవాణా కేంద్రాలు శ్రీవారి భక్తుల రాక తగ్గడంతో తిరుపతిలోని ప్రధాన ప్రాంతాలైన రైల్వే స్టేషన్, బస్టాండ్ ఆవరణలు పూర్తిగా వెలవెలబోయాయి. సాధారణ రోజుల్లోనే ఎప్పుడూ రద్దీగా ఉండే ఈ ప్రాంతాలు, బ్రహ్మోత్సవాలు జరుగుతున్న సమయంలో ఇలా ఖాళీగా దర్శనమివ్వడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. పండుగ పూట ప్రయాణాలు చేయడానికి భక్తులు ఆసక్తి చూపకపోవడమే దీనికి ప్రధాన కారణమని తెలుస్తోంది.

16 CTR 2:16 CTR 2.qxd 9/15/2026 11:25 PM Page 1



# కాణిపాకంలో వైభవంగా చవితి వేడుకలు

-కిక్కిరిసిన కాణిపాకం ఆలయం






కాణిపాకం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో సోమవారం వినాయకచవితి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. విఘ్ననాధుని చెంత ఈవేడుకలను సంప్రదాయబద్దంగా అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో స్వామివారికి ఉభయదారులచే ఆదివారం అర్ధరాత్రి 2 గంటలకు ప్రత్యేక అభిషేకం నిర్వహించి సర్వాంగ సుందర ంగా అలంకరించి ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం సోమవారం వేకువజామున మూడు గంటల నుండి భక్తులకు సర్వదర్శనం కల్పించారు. భక్తులకు కావలసిన ఏర్పాట్లను ఆలయ ఛైర్మన్ వి.మనినాయుడు, ఈఓ కె.పెంచల కిషోర్‌ల ఆధ్వర్యంలో ఆలయ అధికారులు పర్యవేక్షించారు. వినాయకచవితి సందర్భంగా ఆలయాన్ని వివిధరకాల పుష్పాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. అదేవిధంగా వివిధ ప్రాంతాలలో గణేష్‌దీక్ష చేపట్టిన భక్తులు వినాయకచవితి సందర్భంగా కాణిపాకంలో ఇరుముడులను సమర్పించగా సాయంత్రం స్వామివారికి శ్రీకాణిపాకం విఘ్నేశ్వరా యువజన సంఘంవారిచే పుష్పకావళ్ళను సమర్పించారు. ఈమేరకు యువజన సంఘం ఆధ్వర్యంలో భక్తులు కావళ్ళను ఊరేగింపుగా తీసుకువచ్చి స్వామివారికి సమర్పించారు. ఇదిలా వుండగా ఆలయంలోని అలంకార మండపంలో వినాయకచవితి సందర్భంగా వినాయక వ్రతాన్ని సం ప్రదాయబద్దంగా నిర్వహించారు. ఈ వ్రతాన్ని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఎస్పి తుషార్ డూడి,దేవాదాయశాఖ కమీషనర్ రామచంద్రమోహన్, పూతలపట్టు, చిత్తూరు ఎమ్మెల్యేలు కలికిరి మురళీమోహన్, గురుజాల జగన్‌మోహన్‌లతో కలసి లాంఛనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా సిద్ది బుద్ది వినాయకస్వామివారి ఉత్సవమూర్తులను మండపంలో వుంచి వేదపండితుల మంత్రోచ్ఛరణ నడుమ వినాయక వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించి భక్తులకు తీర్థ, ప్రసాదాలను అందజేశారు.

**ఆకట్టుకున్న ప్రత్యేక అలంకరణ :** వినాయకచవితి సందర్భంగా ఆలయాన్ని శోభాయమానంగా అలంకరి ంచారు. ఈసందర్భంగా ప్రధాన ఆలయంలోని బంగారు ధ్వజస్థంభం, ఆన్వేటి మండపం, సుపథమండపం, అలంకార మండపాలను వివిధరకాల విదేశి, స్వదేశీజాతి పుష్పాలు, మామిడితోరణాలు, అరటిచెట్లుతో సర్వాంగసుందరంగా అలంకరిం చారు. ఈప్రత్యేక అలంకరణ భక్తులను ఎంతో ఆకట్టుకుంది. అలాగే ప్రధాన ఆలయంతో పాటు పరివార ఆలయాలను విద్యుత్ ద్వీపాలతో దేదీప్యమానంగా అలంకరించారు.

**పట్టు వస్త్రాల సమర్పణ:**వినాయకచవితి సందర్భంగా జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షుడు దివంగత మహదేవనాయుడు కుటుంబసభ్యులు స్వామివారికి పట్టువస్త్రాలను అందజేశారు. స్వామి, అమ్మవార్లకు ప్రతిఏటా మహదేవనాయుడు కుటుంబీకులు పట్టువస్త్రాలను అందజేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈమేరకు సోమవారం పట్టువస్త్రాలను ఊరేగింపుగా తీసుకువచ్చి ఆలయ అధికారులకు అందజేశారు.

**ఘనంగా గ్రామోత్సవం :** వినాయకచవితి పండుగ పర్వదినం సందర్భంగా స్వామివారికి సోమవారంరాత్రి ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఈమేరకు అలంకరించిన స్వామివారి అమ్మవార్ల ఉత్సవమూర్తులను వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన మూషిక వాహనంపై వుంచి మంగళవాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు.

**ఉచిత ప్రసాదాల పంపిణీ :** వినాయకచవితి సందర్భంగా దేవస్థానంతో పాటు పలువురు దాతలు ఉచితంగా ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. ఉచిత ప్రసాదాల పంపిణీ కార్యక్రమంను ఆలయ ఈఓ పెంచల కిషోర్ ప్రారంభించారు.

**ఇరుముడి దీక్షా మండపం ప్రారంభం :** కాణిపాకం దేవస్థానంలో గణేష్ దీక్ష చేపట్టే భక్తుల కోసం సోమవారం గణేష్‌దీక్షా మండపాన్ని ప్రారంభించారు. ప్రతి ఏటా వినాయకచవితి సందర్భంగా భక్తులు గణేష్‌దీక్ష చేపట్టి ఆలయంలో స్వామివారికి ఇరుముడులు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఈమేరకు ప్రధాన ఆలయం సమీపంలో గణేష్‌దీక్షా మండపాన్ని ఈఓ పెంచల కిషోర్ ప్రారంభించారు. ఇదిలా వుండగా ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి గణేష్‌దీక్ష చేపట్టిన భక్తులు సోమవారం కాణిపాకం చేరుకుని ఇరుముడులు సమర్పించారు. వీరికి ఆలయం వద్ద అధికారులు ప్రత్యేక దర్శనాలను ఏరా ్పటు చేశారు. ఈవేడుకల్లో ఈఈ సతీష్, డిప్యూటీ ఈఓ సాగర్‌బాబు, ఏఈఓలు రవీంద్రబాబు, ఎస్వీ.కృష్ణారెడ్డి, ప్రసాద్, హరిమాధవరెడ్డి, ధనుంజయ, సూపరెండెంట్‌లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, దివాకర్‌రెడ్డి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజినాయుడు, రవిలతో పాటు ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

## కుప్పంలో తమిళనాడు సన్యాసి మృతి!



కుప్పం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త : స్థానిక కొత్తపేటలోని శ్రీ పెద్దపల్లి గంగమ్మ ఆలయంకు చెందిన స్టేజీపై తమిళనాడుకు చెందిన ఓ వృద్ధ సన్యాసి మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. గతకొంతకాలంగా ఇతను స్థానికంగా తిరుగుతుండేవారు. క్లస్టర్ ఇన్చార్జ్ కన్నన్ సంఘటనా స్థలిని పరిశీలించి పోలీసులకు, మున్సిపల్ అధికారులకు సమాచారం అందించారు. స్థానిక దేశం నేతలు కృష్ణన్, హరినాథ్‌గౌడ్, మైకేల్, రఫీక్, మదన్, దిలీప్ తదితరులు అక్కడకు చేరుకున్నారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించగా వృద్ధ సన్యాసి తాను చెన్నై శ్రీపెరంబూరుకు చెందిన సోమసుందరం అని, తన చిరునామా, కుటుంబీకుల ఫోన్‌నెంబర్లు రాసి ఉన్నట్లు గుర్తించారు. మృతదేహాన్ని కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించిన పోలీసులు మృతుడి కుటుంబీకులకు ఫోన్లో సమాచారం ఇచ్చారు.

## నేడు రాజకీయపార్టీ ప్రతినిధులతో సమావేశం

**కుప్పం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:** కుప్పం మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల పోలి ంగ్ స్టేషన్ల జాబితాలపై 11గంటలకు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ఈసమావేశాన్ని పోలింగ్ కేంద్రాలపై అభ్య ంతరాల అంశంపై నిర్వహించడం జరుగుతుందన్నారు. మండల పార్టీ అధ్యక్షులు హాజరు కావాలని కోరారు.

## ఎస్‌ఎంసి కమిటీలకు ఎన్నికల షెడ్యూల్

శాంతిపురం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: పాఠశాల మేనేజ్‌మెంట్ ఎన్నికలకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంఇఒలు పాండియన్, చంద్రమ్మ తెలిపారు. ఈనెల 15న ఎస్‌ఎంసి ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల, 18న ఓటర్ల జాబితా ప్రదర్శన, 25న అభ్యంతరాల స్వీకరణ, 29న ఎస్‌ఎంసి సభ్యులు, ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ ఎన్నిక, అదేరోజు మధ్యాహ్నం ఎస్‌ఎంసి సమావేశం జరుగుతుందన్నారు.

## 1.65లక్షలు పలికిన వినాయకుడి లడ్డూ



శాంతిపురం, సెప్టెంబర్ 15 ప్రభాత వార్త: శాంతిపురంలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటుచేసిన వినాయక విగ్రహం లడ్డూకు వేలం నిర్వహించగా 1.65లక్షలతో కటారి బిల్డర్స్ వారు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున టపాకాయలు కాలాంచరు. అనంతరం విగ్రహాన్ని మేళతాళాల మధ్య ఊరేగింపుగా తీసుకెళ్లారు. శాంతిపురం యువత ప్రత్యేక దుస్తులు ధరించి నిమజ్జ నంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జ్ఞానేష్, అప్పు, విక్కీ, హృతిక్, భరత్, వినయ్, యశ్వంత్, గ్రామస్తులు పాల్గొన్నారు. మండల సచివాలయం వద్ద త్రిశూల్ యూత్ అధ్వర్యంలో ఏర్పాటుచేసిన విగ్రహం లడ్డూను వరుణ్ యాభైవేలకు దక్కించుకున్నాడు. ఈ విగ్రహంను కూడా నిమజ ్జనంకు తరలించారు. కార్యక్రమంలో ఫన్నీ, ఉదయ్, వరుణ్, యువత పాల్గొన్నారు.

## 17వ తేదీ వరకు అభ్యంతరాల స్వీకరణ : కమీషనర్



కుప్పం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కుప్ప మున్సిపాలిటీలో ఇదివరకు ప్రచురించిన ఓటర్ల జాబితా పై అభ్యంతరాలను ఈ నెల 17వ తేదీ వరకు స్వీకరించడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ ,బీసీ, మహిళ ఓటర్లకు సంబంధించి ఏదైనా అభ్యంతరాలు ఉంటే 17వ తేదీలోగా రాజకీయ పక్షాలు తమ అభ్యంతరాలను కార్యాలయంలో తెలియజేయవచ్చని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే ఓటరు జాబితాను ప్రభుత్వ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచామన్నారు.

## శ్రీ బేటరాయ స్వామి కొండలో...

టిటిడిచే శ్రీవారి కల్యాణోత్సవం



కుప్పం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: మండలంలోని ఉర్ల ఓబనపల్లి పంచాయతీ లోని శ్రీ బేట రాయ స్వామి కొండ వద్ద సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో అక్టోబర్ 3వ తేదీ టీటీడీ ఆధ్వర్యంలో శ్రీవారి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం తెలిపారు. పెరటాసి మాసం మూడో శనివారం నాడు ఏటా ఇక్కడ టిటిడి ఆధ్వర్యంలో శ్రీవారి కల్యాణోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు .అదే రోజు భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం సైతం నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. శ్రీవారి కల్యాణోత్సవానికి సంబంధించిన కరపత్రాలను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఎం మాజీ పిఏ మనోహర్ ,టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, అర్చకులు ప్రతాప్ సింహ, నాయకులు మురుగేష్ ,లక్ష్మీపతి, సికేమణి, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

## కొలువుతీరిన గణపయ్యలు.



**కుప్పం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:** వినాయక చవితి పండుగను పురస్కరించుకుని కుప్పం పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో బొజ్జ గణపయ్యలు కొలువు తీరారు. వివిధ రూపాల్లో ఉన్న వినాయక విగ్రహాలను ప్రతిష్టించి ప్రత్యేక పూజలను నిర్వహించారు. మండపాల వద్ద స్వామివారి విగ్రహాలకు ప్రత్యేక అలంకరణలు చేయడంతో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో వస్తున్నారు.

## తవణంపల్లెలో ఘనంగా వినాయకచవితి వేడుకలు

తవణంపల్లె, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: వినాయకచవితి పండుగ పర్వదినాన్ని మండల ప్రజలు సోమవారం అత్యంత భక్తిశ్రద్దలతో ఘనంగా జరుపుకున్నారు.ఈసందర్భంగా మండలంలో గ్రామ గ్రామాల్లో, వీధుల్లో విఘ్ననాయకుడైన గణనాధుని నిలువెత్తు ప్రతిమలను ప్రతిష్టించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారికి ప్రీతిపాత్రమైన ఫల, పుష్పాలు, పత్రిలను, పిండి వంటలను నైవేద్యంగా సమర్పించి ప్రత్యేకపూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. విఘ్ననాధుని కుల, మతాలకు అతీతంగా ప్రతి ఇంట్లోను ప్రతిష్టించి వినాయకచవితి పండుగను సంప్రదాయబద్దంగా నిర్వహించుకున్నారు. పలు ప్రాంతాల్లో వినాయక ప్రతిమను నిర్వహించారు.

**ఐరాలలో...**

**ఐరాల, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:** వినాయకచవితి పండుగను సోమవారం మండల ప్రజలు అత్యంత భక్తి శ్రద్దలతో వైభవంగా నిర్వహించుకున్నారు. ఈసందర్భంగా మండలంలోని వాడవాడలా వినాయకుని విగ్రహాలను ప్రతిష్టించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. యువకులు ఉత్సాహంగా వాడవాడలా, వీధివీధినా వినాయకుని విగ్రహాలను ఏర్పాటు చేసి మంగళ వాయిద్యాలు, ప్రత్యేక బాజా సంచా పేలుళ్ళ నడుమ పూజలు నిర్వహించారు.

## ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



**కాణిపాకం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమ, మంగళవారాల్లో జరిగిన వినాయకచవితి, హంసవాహన సేవ కార్యక్రమాల సందర్భంగా ఏర్పాటు చేసిన వివధ రకాల సాంస్కృతి కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. ఈమేరకు వినాయచవితి సందర్భంగా స్వామివారికి మంత్రి పట్టువస్త్రాలు సమర్పించేందుకు వచ్చిన సమయంలో, హంసవాహన సేవ కార్యక్రమాల సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమలు భక్తులను ఎంతో అలరించాయి.

## సిఎం చంద్రబాబును కలసిన ప్రభుత్వ విప్ కంచర్ల

- కుప్పం, చిత్తూరు జిల్లా ఎన్నికల బాధ్యతలు అప్పగింత !!



కుప్పం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త : సిఎం చంద్రబాబునాయుడును మంగళవారం ప్రభుత్వవిప్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా సిఎం చంద్రబాబునాయుడు డాక్టర్ కంచర్ల శ్రీకాంత్‌కు కుప్పం నియోజకవర్గంతో పాటు చిత్తూరు జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల బాధ్యతలను అప్పగించారు. కుప్పం నియోజకవర్గంలో వందశాతం స్ట్రైక్ రేట్‌ను ఎన్నికల్లో సాధించాలని, అన్ని చోట్ల కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సిఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. పంచాయతీ ఎన్నికల్లో అన్ని పంచాయతీలు గెలవాలని గో ఎహెడ్.. నేనున్నాను అని సిఎం పేర్కొన్నట్లు తెలిసింది. ఈ సందర్భంగా డాక్టర్ కంచర్ల సిఎం చంద్రబాబునాయుడుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకునేందుకు శక్తివ ంచన లేకుండా కృషి చేస్తానన్నారు. కుప్పంతో పాటు చిత్తూరు జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు నాయకులు, కార్యకర్తలతో సమన్వయంగా పనిచేసి స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని సిఎం సూచించినట్లు తెలిపారు.

## స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం



కుప్పం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష ్యంగా పనిచేయాలని ఆరీ ్టసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. మంగళవారం ఎన్. కొత్తపల్లిలో టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్ అధ్యక్షతన జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ శ్రేణులు ఐకమత్యంతో పనిచేయాలన్నారు. సిఎం చంద్రబాబు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, ఎపిఐఐసి డైరెక్టర్ ప్రేమ్‌కుమార్, కడ సభ్యుడు రామచంద్ర, క్లస్టర్ ఇన్‌చార్జ్ హైదర్ వలీ, కార్పోరేషన్ డైరెక్టర్లు శరవణ,మణి, పార్థసారథి, నాయకులు వెంకటేష్,ఎవి రవి, బగ్గిడి వెంకటేష్, శ్రీనివాసులు, అశోక్, గాయత్రి, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## చంద్రబాబు చేస్తున్న మంచి ప్రజలకు చెప్పాలి

- పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు



**కుప్పం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:** సిఎం చంద్రబాబునాయుడు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాలను ప్రజలకు వివరించి ప్రజల మద్దతు మరింత పొందుదామని పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సుజ్ఞానంద ఆ శ్రమంలో మున్సిపల్ పరిధి 16,17,18వార్డుల సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా అందరూ కలసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కడ సభ్యుడు రాజ్‌కుమార్, రెస్కో ఛైర్మన్ ప్రతాప్‌కుమార్, మున్సిపల్ పార్టీ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, మాజీ సర ్పంచులు గోపీనాథ్, డాక్టర్ వెంకటేష్, క్లస్టర్ ఇన్‌చార్జ్ సోమశేఖర్, కో క్లస్టర్ శ్యామ్ సుందర్, నేతలు సత్యేంద్రశేఖర్, ఆర్ఆర్ రవి, మంజు, హర్ష ధర్మతేజ తదితరులు

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## స్థానిక పోరు కంటే ముందుగా...

పాఠశాల నిర్వహణ కమిటీ ఎన్నికలు - ఎన్‌ఎంసి ఎన్నికల నోటిఫికేషన్ జారీ

- 18న ఓటర్ల జాబితా ప్రదర్శన, 29వ తేదీ ఎన్నికలు

చిత్తూరు, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే ప్రభుత్వం పాఠశాల నిర్వహణ కమిటీ ఎన్నికలకు పచ్చజెండా ఊపింది. ఈ మేరకు జిల్లా సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ వెంకటరమణ పాఠశాల నిర్వహణ కమిటీ ఎన్నికల షెడ్యూల్ జారీ చేశారు. ఎన్నికల షెడ్యూల్ మేరకు మంగళవారం పాఠశాల నిర్వహణ కమిటీ ఎన్నికలకు నోటిపికేషన్ జారీ అయ్యింది. సెప్టెంబర్ 18వ తేదీ ఓటర్ల జాబితాను సంబంధిత పాఠశాలల నోటీసు బోర్డులపై ప్రదర్శిస్తారు. ఓటర్ల జాబితాపై అభ్యంతరాలను సెప్టెంబర్ 25వ తేదీలోపు సంబంధిత పాఠశాల ప్రాధానోపాధ్యాయులకు తెలియజేయాల్సి వుంటుంది. సెప్టెంబర్ 29న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు నిర్వహిస్తారు. ఎన్నికల పోలింగ్ ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు వుంటుంది. ప్రభుత్వం నిర్ధేశించిన నిబంధనలు, మార్గదర్శకాలను అనుగుణంగా ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్లు చేపట్టనున్నట్లు సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ వెంకటరమణ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు, సంరక్షకులు, అర్హత కల్గిన సభ్యులు ఎన్నికల ప్రక్రియలో చురుకుగా పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అధికారులు కోరారు. ఓటర్ల జాబితాను పరిశీలించి, ఎదైనా అభ్యంతరాలు వుంటే నిర్ణీత గడువులోపు సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. అలాగే ఎస్‌ఎంసి ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహింఒచడానికి పాఠశాలల హెడ్మాస్టర్లు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సంరక్షకులు, సంబంధిత అధికారులు సమన్వయంతో పూర్తి సహకారం అందించాలని అధికారులు కోరారు.

## స్థానిక ఎన్నికల్లో బోగస్ కుల సర్టిఫికేట్లకు అడ్డుకట్ట

- కలెక్టర్‌ను కోరిన జాతీయ బిసీ సంక్షేమ సంఘ ప్రధాన కార్యదర్శి షణ్ముగం



చిత్తూరు, సెప్టెంబర్ 15 ప్రభాత వార్త: స్థానిక సంస్థల ఎన్నికల్లో బోగస్ కుల సర్టిఫికేట్లకు అడ్డుకట్ట వేయాలని జాతీయ బిసీ సంక్షేమ సంఘ ప్రధాన కార్యదర్శి, మాజీ టౌన్‌బ్యాంకు ఛైర్మన్ షణ్ముగం కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కోరారు. జాతీయ బిసీ సంక్షేమ సంఘ ప్రధాన కార్యదర్శి షణ్ముగం మంగళవారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ వినతిపత్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో నకిలీ బిసీ అభ్యర్థులను అరికట్టాలని, ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించిందన్నారు. బిసీలకు కల్పించిన రిజర్వేషన్లు అన్యాక్రాంతం అవుతున్నాయని, కలెక్టర్ చొరవ తీసుకుని నియంత్రించాలని కోరారు. బిసీలకు కల్పించిన రిజర్వేషన్లను బిసీ వర్గాలకు పూర్తి ఫలాలు అందనీయకుండా కొన్ని కులాలు దుర్వినియోగపరస్తున్నాయని, వీటిని అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై వుందన్నారు. బిసీ కుల సర్టిఫికేట్లు జారీ చేసే సమయంలో క్షేత్ర స్థాయిలో విఆర్‌ఓలు, తహసిల్దార్లు పక్కాగా తనిఖీ చేయాలన్నారు. ఇప్పటి వరకు విద్య, ఉద్యోగ రంగాల్లో అనేక మంది నకిలీ బిసీ సర్టిఫికేట్లు పొంది నిజమైన బిసీలకు నష్టం కల్గించారన్నారు.

## గణపయ్య తొలిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే



**చిత్తూరురూరల్, సెప్టెంబరు 15 ప్రభాతవార్త:** చిత్తూరునగరం, 32వ డివిజను నందు వినాయక చవితి సందర్భంగా డివిజన్ అధ్యక్షురాలు ఎన్.హేమావతి, కమిటీ సభ్యులు విక్రమ్, శివయ్య, మోహన్‌కుమార్, హర్షవర్ధన్ బృందం ఆద్వర్యంలో ఏర్పాటుచేసిన శక్తిగణపయ్య తొలిపూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ పాల్గొన్నారు. నియోజక అభివృద్ధికి ప్రజల సహకారం ఎన్నటికీ మరువనని, వారు చూపుతున్న సహాయసహకాలతోనే నియోజకవర్గానికి అన్ని విదాల అభివృద్ధి చేయడం జరుగుతోందని త్వరలోనే నియోజకవర్గ రూపు రేఖలను మారుస్తామని తెలిపారు. అనంతరం భక్తులకు ఉత్సవ కమిటీ సభ్యుల ఆద్వర్యంలో అన్నదానం చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యులు గురజాల సురేష్, శాసనసభ్యుల కార్యదర్శి కుమార్‌స్వామి, రెస్టారెంట్ ఇన్‌ఛార్జ్ వరదరాజులు, డివిజన్ నాయకులు త్రిమూర్తినాయుడు, భార్గవ్, కరీం, మహిళా సభ్యులు మలార్, విజయ, రోజా రమణి, గిరిజ, శిల్ప, రమాదేవి, మీనా, సరిత, ప్రియా, యమున తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమమైన జీవనవిధానంకు ఆధ్యాత్మిక రంగమే సరైన మార్గం

- శ్రీ షిర్డీసాయి ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ లావణ్యాబాబు



చిత్తూరురూరల్, సెప్టెంబరు 15 ప్రభాతవార్త: ఉత్తమమైన జీవన విధానానికి ఆధ్మాత్మిక రంగమే సరైన మార్గమని శ్రీ షిర్డీసాయి ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ లావణ్యాబాబు తెలిపారు. కాణిపాకం సమీపంలోని శ్రీ విఘ్నేశ్వర పిరమిడ్ మహా శక్తిక్షేత్రం నందు మూడు రోజుల పాటు నిర్వహించే ధ్యాన మహాయజ్ఞంకు ఆమె ముఖ్యఅతిధిగా పాల్గొని జ్యోతిప్రజ్వలనతో ప్రసంగించారు. మొదటగా 30 సంవత్సరాల క్రితం పత్రీజితో కలసి పాల్గొన్న మూడురోజల ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఆయనతో పంచుకున్న అనుభవాలు, వారి నుండి పొందిన ఆత్మజ్ఞానం గుర్తు చేస్తుచేసుకున్నారు. అనాపానసతి ధ్యానం, శ్వాసమీద ధ్యానం గురించి పత్రీజీ చెప్పిన విషయాలు తననెంతో ఆకట్టుకొన్నాయన్నారు. ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితికి చేరుకోవడానికి ఇది సరైన మార్గమని, ఈ మార్గాన్ని ఎవ్వరూ వదలిపెట్టవద్దని సూచించారు. చిత్తూరు జిల్లాలో మొట్టమొదటి సారి అత్యంత శక్తివంతమైన క్షేత్రం కాణిపాకం శ్రీ విఘ్నేశ్వర పిరమిడ్ మహాశక్తి క్షేత్రం నందు ధ్యాన మహా యజ్ఞంను అంగరంగ వైభవంగా నిర్వహించడం చాలా ఆనందదాయకంగా వుందన్నారు. అనంతరం ముఖ్యఅతిధులుగా విచ్చేసిన లావణ్యాబాబు, సీనియర్ పిరమిడ్ మాస్టర్లను దుశ్శాలువతో సంస్థ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కాగా ఈ కార్యక్రమంకు ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలనుంచి హాజరైన 1000 మందికి భోజన వసతి ఏర్పాట్లు చేసారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు డా.గోపాలక్రిష్ణమూర్తి, రాధిక, లోహిత్, పవిత్ర, మాధురి, అశ్విత్, జ్యోష్ణ, సీనియర్ పిరమిడ్ మాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## గణనాధుని దర్శించుకున్న పలువురు ప్రముఖులు



**కాణిపాకం,సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:**

వినాయకచవితి పండుగ పర్వదినం సందర్భంగా సోమవారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఈమేరకు రాష్ట్ర దేవాదాయ,ధర్మాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఆం ధ్రదేశ రాష్ట్ర ఉప లోకాయుక్త రజనీ, దేవాదాయశాఖ కమీషనర్ రామచంద్రమోహన్,జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, పూతలపట్టు, చిత్తూరు ఎమ్మెల్యేలు కలికిరి మురళీమోహన్, గురుజాల జగన్‌మోహన్ తదితరులు కాణిపాకం స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఛైర్మన్ మణినాయుడు,ఈఓ పెంచల కిషోర్,ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదపండితుల ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. వారి వెంట ప్రోటోకాల్ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## పట్టురైతులకు గిట్టుబాటు ధరలు అందేలా చర్యలు

- ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు

***కుప్పం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:*** కుప్పం నియోజకవర్గంలో పట్టుసాగు రైతులకు సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం గిట్టుబాటు ధరలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు పేర్కొన్నారు. మంగళవారం ఆయన స్థానిక పట్టుగూళ్ల విక్రయ కేంద్రాన్ని సందర్శించి పట్టురైతులు, అధికారులతో మాట్లాడారు. రైతులకు అవసరమైన కనీస వసతుల కల్పనకు తగు ప్రణాళికలు రూపొందించి కడ కార్యాలయంలో అందించా మన్నారు. త్వరలోనే పనులు చేపడ్తామన్నారు. కాగా మంగళవారం పట్టుగూళ్లు కిలో 870రూ.ల ధర పలకడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పట్టుశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## 9వజాతీయ పోషణ మహోత్సవం



తడ, సెప్టెంబరు 15 ప్రభాతవార్త: తడ మండలం వాటంబేడు అంగన్వాడి కేంద్రంలో మంగళవారం 9వ జాతీయ పోషణ మహా కార్యక్రమం సూళ్లూరుపేట స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ఘనంగా నిర్వహించారు. అంగన్వాడి సూపర్వైజర్ లక్ష్మీనారాయణమ్మ గర్భవతులకు బాలింతలకు చిన్నపిల్లల తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అధిక పోషక విలువలతో కూడిన ఆహారాన్ని పిల్లలుకు అందించాలని వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పిల్లల పోషణపై శ్రద్ధ వహించాలని ప్రేమ ఆప్యాయతలతో క్రమశిక్షణతో మెలిగే విధంగా చూసుకోవాలి గర్భవతులకు బాలింతలకు చిన్నపిల్లల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం అంగన్వాడి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వాడవాడలా వినాయక చవితి వేడుకలు



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలో వినాయక చవితి పర్వదినాన్ని వాడవల అత్యంత ఘనంగా జరుపుకున్నారు. పట్నంలోని వివిధ కూడళ్ళలో వినాయకుని విగ్రహాలను ప్రతిష్టించి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. గత ఏడాది కన్నా ఈసారి పెద్ద సంఖ్యలో విగ్రహాలు ఉత్సాహంగా ప్రతిష్టించారు. శ్రీనగర్ కాలనీలో వినాయక విగ్రహాన్ని శాస్త్రోతకంగా ప్రతిష్టించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. షార్ బస్టాండ్, గవండ్ల వీధి, కచ్చే వీధి, సాయి నగర్, సరసమ్మ కట్ట, కోళ్ల మిట్ట, ఇందిరా నగర్, సూళ్లూరు, ఝాన్సీ నగర్, బాపూజీ కాలనీ, వట్రపాలెంతో పాటు వివిధ ప్రాంతాల్లో వినాయక ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీనగర్ కాలనీలో ప్రముఖ వేద పండితులు చంద్రపట్లప్రకాష్ శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. కాలనీవాసులు పర్వత రెడ్డి ప్రభాకర్ రెడ్డి, దువ్వూరు శేఖర్ రెడ్డి, ఎంవి రమణయ్య, పర్వత రెడ్డి చంద్రారెడ్డి, కుమార్ రెడ్డి, బుల్లి రెడ్డి, వేనాడు జనార్ధన్ రెడ్డి,ఎం రమణయ్య, చెంగారెడ్డి తదితరులు దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, పిల్లలకు ఆటల పోటీలు, లలిత సహస్ర పారాయణం, హరే రామ హరే కృష్ణ సంకీర్తనలు అలరించాయి. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు.

## మున్సిపాలిటీలో ఎస్సీ, ఎస్టీ బీసీ ఓటర్ల జాబితా ప్రచురణ

సూళ్లూరుపేట, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: మునిసిపాలిటీలోని 32 వార్డులకు సంబంధించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళ ఓటర్ల జాబితాను మంగళవారం ప్రచురించారు. ఈ జాబితాను ఆర్డీవో, మున్సిపల్, తహసిల్దార్ కార్యాలయాలలో ప్రజలకు అందుబాటులో ఉంచారు. ఈ జాబితాలను ఓటర్లు పరిశీలించుకుని వాటిలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే 17వ తేదీ సాయంత్రం లోగా మున్సిపల్ కార్యాలయ పనివేళలలో నిర్దేశ త ఫారం 2,3లలో తమ అభ్యంతరాలను రాతపూర్వకంగా అందజేయాలని మున్సిపల్ కమిషనర్ కే. చిన్నయ్య తెలిపారు.

## చంద్రబాబును కలసిన ఎమ్మెల్యే నెలవల



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: తిరుమలలో జరుగుతున్న సాలుకట్ల బ్రహ్మోత్స వాలలో పాల్గొనేందుకు మంగళవారం తిరుపతికి వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును స్థానిక ఎమ్మెల్యే నెలవ విజయ శ్రీ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెతో పాటు మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం సీఎంను కలిశారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుని దుర్మరణం

సూళ్లూరుపేట, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలోని తహసిల్దార్ కార్యాలయం వద్ద ఉన్న రైల్వే గేట్ సమీపంలో సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో హసీఫ్ (20) అనే యువకుడు దుర్మరణం పాలయ్యాడు. స్నేహితులతో కలిసి మోటార్ బైక్ పై వెళుతుండగా ఫీడ్ బ్రేకర్‌పై ఎక్కుతూ అదుపు తప్పి క్రింద పడడంతో హసీఫ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మోటర్ బైక్‌లోని మరో ఇద్దరూ గాయపడడంతో వారిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మండలంలో ఘనంగా వినాయక చవితి వేడుకలు



బాలాయపల్లి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: మండలంలో వినాయక చవితి సందర్భంగా వాడవాడల పోటాపోటీగా మట్టితో తయారు చేసిన గణనాథుని భారీ విగ్రహాలను ప్రత్యేక పందిళ్లలో కొలువు దిర్చి విశేష పూజలు నిర్వహించారు. జయ ంపు, సుబ్రహ్మణ్యం, వెంగమాంబపురం, యాచారం తదితర గ్రామాల్లో స్వామి వారి విగ్రహాలు చూసేందుకు చిన్నారులు, యువత ఆసక్తి కనబరిచారు. వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి విశేష హారతులు ఇచ్చారు. మండలంలో గ్రామాలలోని గృహాలలో పసుపు, మట్టి తో చేసిన గణనాథుని ప్రతిమలను భక్తులు పూజించారు. పలు చోట్ల మూషిక, హంస, అంబారి వంటి ప్రత్యేక వాహనాలపై స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. 21 రకాల ఆకుల పత్రితో, పూలతో అలంకరించారు. కుడుములు, ఉండ్రులు, చెరుకు నైవేద్యంగా సమర్పించారు. స్వామి వారి వ్రత కథను శ్రద్ధగా ఆలకించారు. ఆలయ కమిటీ వారు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ పూజల్లో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు రావి సత్యం నాయుడు, మండల పార్టీ మాజీ అధ్యక్షులు రావి మస్తాన్ నాయుడు, పాల్గొని కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

# గణనాధునికి ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాల బహూకరణ



కాణిపాకం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పట్టువస్త్రాలను సమర్పించారు. ప్రతిఏటా బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించడం ఆనవాయితీ. ఈమేరకు మంత్రి కలెక్టర్ సుమిత్‌కుమార్, దేవాదాయశాఖ కమీషనర్ రామచంద్ర మోహన్, పూతలపట్టు, చిత్తూరు ఎమ్మెల్యేలు కలికిరి మురళీమోహన్, గురుజాల జగన్‌మోహన్‌లతో కలసి పట్టువస్త్రాలను దేవస్థానం అతిథి గృహం నుండి ఊరేగింపుగా తీసుకువచ్చి స్వామివారికి సమర్పించారు. వీటిని అర్చకులు స్వామి అమ్మవార్లకు అలంకరి ంచి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి ఆనం, కలెక్టర్, ఎమ్మెల్యేలు స్వామివారి సేవలో పాల్గొన్నారు. పట్టువస్త్రాలను సమర్పించేందుకు వచ్చిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కలెక్టర్ సుమిత్ కుమార్, కమీషనర్ రామచంద్రమోహన్, ఎమ్మెల్యేలు మురళీమోహన్, గురుజాల జగన్ మోహన్‌లకు ఆలయ ఛైర్మన్ వి.మణి నాయుడు, ఈఓ పెంచల కిషోర్, అర్చకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వారికి వేదాశీర్వచనం చేసి స్వామివారి చిత్రపటాన్ని, శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. ఈఈ సతీష్, డిప్యూటీ ఈఓ సాగర్‌బాబు, జిల్లా అసిస్టెంట్ కమీషనర్ చిట్టెమ్మ, ఏఈఓలు రవీంద్రబాబు, ధనపాల్, పలువురు స్థానిక నాయకులు, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.

# హంసవాహనంపై విహరించిన విఘ్ననాధుడు



కాణిపాకం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం రాత్రి గణనాధునికి హంసవాహనం సేవను ఘనంగా నిర్వహించారు. ఆలయంలో మంగళవారం ఉదయం ధ్వజారోహణం కార్యక్రమం జరుగగా రాత్రి స్వామి వారికి హంసవాహన సేవను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి కాణిపాకం, అగరంపల్లె, కారకాంపల్లె, వడ్రాంపల్లె, తిరువణంపల్లె గ్రామాదుల శీర్‌కరుణీకర్ వంశస్థులు ఉభయదాతలుగా వ్యవహరించారు. వీరు ఉదయం వరుస ఉభయం తీసుకురాగా అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. అలాగే రాత్రి స్వామి అమ్మవార్ల ఉత్సమూర్తులను అలంకార మండపంలో వుంచి అలంకరించి వేదపండితుల మంత్రోచ్ఛరణ నడుమ ప్రత్యేకపూజలతో ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. వివిధరకాల పరిమళ పుష్పాలతో అలంకరించిన హంస వాహనంపై స్వామి అమ్మవార్లను వుంచి మంగళవాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ వి.మణినాయుడు, ఈఓ పెంచల కిషోర్, ఏఈఓలు ఎస్వీ,కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, ప్రసాద్, ధనపాల్, హరిమాధవరెడ్డి, ధనుజంయ సూపరెండెంట్‌లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, దివాకర్‌రెడ్డి ,టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజినాయుడు,రవిలతో పాటు ఉత్సవ ఉభయదారులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

### కాణిపాకంలో నేడు( బుధవారం)

ఉదయం : అభిషేకం, నెమలివాహనం సేవ
రాత్రి : బంగారు నెమలివాహనసేవ
ఉభయదారులు : కాణిపాకం, చినకాంపల్లె, కొత్తపల్లె, చిగరపల్లె, అగరంపల్లె, వడ్రాంపల్లె, దామరకుంట, కురప్పల్లె, గ్రామాదుల రెడ్డి వంశస్థులు
సాంస్కృతిక కార్యక్రమాలు: ఉదయం 10 గంటల నుండి అర్ధరాత్రి వరకు పలు రకాల సాంస్కృతిక, పౌరాణిక నాట్య ప్రదర్శనలు గ్రామోత్సవం ప్రారంభమయినప్పటి నుండి కోలాటాలు వంటి కార్యక్రమాలు.

## ఫల, పుష్ప ప్రదర్శన ప్రారంభం



తొమ్మిది రోజులపాటు అత్యంత వైభవంగా నిర్వహించే వార్షిక బ్రహ్మోత్సవాలకు విచ్చేసే లక్షలాది మంది భక్తుల కోసం విస్తృత ఏర్పాట్లను టిటిడి ఏర్పాటు చేసింది. కల్యాణ వేదిక వద్ద ఏర్పాటు చేసిన ఫల, పుష్ప, ఫోటో, గార్డెన్, అటవీ, ఎస్వీఐటీఎస్‌ఏ, ఆయుర్వేద తదితర ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయని ఛైర్మన్ తెలిపారు.

**ప్రభాతవార్త-తిరుమల**

## ప్రత్యేక ఆకర్షణగా సైకత మహావిష్ణువు కల్కి అవతారం




తిరుమల,సెప్టెంబర్ 15 ప్రభాతవార్తప్రతినిధి:ఏడుకొండల్లో అంగరంగవైభవంగా ఆరంభమైన సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తుల కోసం ఏర్పాటుచేసిన శైకతశిల్పం విష్ణుమూర్తి కల్కిఅవతారం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. టిటిడి ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో తిరుమలలోని కల్యాణవేదిక వద్ద ఏర్పాటుచేసిన ఈ సైకత శిల్పం భక్తిభావాన్ని పంచుతోంది. బెంగళూరుకు చెందిన గౌరి ఈ సైకత శిల్పాన్ని రూపొ ందించారు. టిటిడి ఉద్యానవన విభాగం 2014 శ్రీవారి బ్రహ్మోత్సవాల నుండి ఫలపుష్ప ప్రదర్శనశాలలో సైకత శిల్పాలకు చోటు కల్పిస్తోంది. ఇప్పటివరకు శ్రీభూవరాహస్వామి, వైకుంఠం నుంచి శ్రీవారి ఆనందనిలయ విమానాన్ని తీసుకొస్తున్న గరుత్మంతుడు, మత్స్యావతారం రూపాలను ఇసుకతో తీర్చిదిద్దారు. టిటిడి ఉద్యానవన విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు పర్యవేక్షణలో ఈ సైకత శిల్పాన్ని ఏర్పాటుచేశారు. టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఈఓ ముద్దాడ రవిచంద్ర,అదనపు ఈఓ వెంకయ్యచౌదరి, సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి పాల్గొన్నారు.

## తుమ్మలగుంటలో... అట్టహాసంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభం..!

**-ధ్వజారోహణంతో ముక్కోటి దేవతలకు ఆహ్వానం**
**-పెద్దశేషునిపై పరమపదనాధుని అలంకరణలో విహారం**
**-బ్రహ్మోత్సవాల నిర్వహణకై కంకణ దారులైన చెవిరెడ్డి దంపతులు**



తిరుపతిరూరల్, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త ప్రభాతవార్త: తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం సాయంత్రం వైఖానస ఆగమోక్తంగా ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణ మధ్య ధ్వజపటాన్ని ధ్వజస్తంభంపై ప్రతిష్ఠించారు. అంతకుముందు భేరిపూజ, భేరితాడనం, ధ్వజపటం, నవసంధి, మాడ వీధి ఉత్సవం, ఆస్థానం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. నూతన వస్త్రంపై గరుత్మంతుడి చిత్రాన్ని లిఖించి పూజలు చేసిన అనంతరం ధ్వజస్తంభంపై ప్రతిష్ఠించారు. 18 గణాలు, ముక్కోటి దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించడమే ధ్వజారోహణ ప్రధాన ఉద్దేశమని అర్చకులు తెలిపారు.

**పెద్దశేషునిపై పరమపదనాథుడు:**

శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలి రోజు రాత్రి పెద్దశేష వాహన సేవ కన్నులపండువగా సాగింది. శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామివారు ఏడుతలల పెద్దశేష వాహనంపై పరమపదనాథుడి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 7.30 నుంచి 9.30 గంటల వరకు జరిగిన వాహన సేవలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి వాహన సేవల్లో పాల్గొని భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.

**కంకణధారణ చేసిన చెవిరెడ్డి:**

శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలనే సంకల్పంతో ఆలయ వ్యవస్థాపకులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కంకణధారణ చేశారు. మంగళవారం సాయంత్రం ధ్వజారోహణం సందర్భంగా ఆయన కంకణం కట్టుకున్నారు. అంతకు ముందు గోవిందమాల ధరించి దీక్ష చేపట్టారు. బ్రహ్మోత్సవాల ముగింపు అనంతరం దీక్షను విరమించనున్నారు.

**శాస్త్రోక్తంగా అంకురార్పణ:**

శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు సోమవారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ కార్యక్రమం జరిగింది. అనంతరం విశ్వక్సేనుల వారు తుమ్మలగుంట గ్రామంలో విహరిస్తూ బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## ఆకట్టుకున్న పసుపు కొమ్ముల వినాయకుడు



బాలాయపల్లి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త : కోర్టు కూడలి వద్ద పసుపు కొమ్ములతో తయారుచేసిన వినాయకుడు అందర్నీ ఆకట్టుకుంది. పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకొని మట్టి పసుపు కొమ్ములతో గుద్దేటి అమర్, మిత్రబృందం ఈ వినాయకుడిని తయారు చేశారు. అమర్ అనే ఉద్యోగి ఈ వినాయకుని తయారు చేశారు. 5000 పసుపు కొమ్ములను ఉపయోగించి వినాయకుడిని తయారు చేసినట్లు అమర్ తెలిపారు. ప్రతి సంవత్సరం వినాయకుని తయారు చేస్తున్నట్లు తెలిపారు. పర్యావరణానికి ముప్పు రాకుండా మట్టి, పసుపు కొమ్ములతో తయారు చేసినట్లు తెలిపారు. మంది భక్తులు తరలివచ్చి ఈ వినాయకుడిని దర్శించి పూజలు చేసుకున్నారు. ప్రతి సంవత్సరం కొత్త తరహాలో వినాయకుళ్ళను ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు శివకుమార్ తెలిపారు.

## ఏపీ ఎంఎస్సీ ఎంఈ చైర్మన్‌ని కలిసిన కృష్ణయ్య



బాలాయపల్లి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, ఏపీ ఎంఎస్ ఈఎం చైర్మన్, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు నెల్లూరు పార్లమెంట్, ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గాల పరిశీలకులుగా వ్యవహ రిస్తున్న తమ్మిరెడ్డి శివశంకర్ ని జనసేన పార్టీ సీనియర్ నాయకులు తోట కృష్ణయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వెంకటగిరి మున్సిపాలిటీ చైర్మన్ అభ్యర్థిగా జనసేన పార్టీ తరపున పోటీ చేయాలనే తన అభ్యర్థిత్వాన్ని తోట కృష్ణయ్య, తమ్మిరెడ్డి శివశంకర్ కి తెలియజేశారు. వెంకటగిరి ప్రాంతంలో జనసేన పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి తాను చేస్తున్న కార్యక్రమాలు, పార్టీ పట్ల తనకున్న నిబద్ధతను ఈ సందర్భంగా వివరించారు.

## సీఎం చంద్రబాబు నాయుడు కలిసిన ఎమ్మెల్యే



బాలాయపల్లి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తిరుపతికి వచ్చిన సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ రాజకీయాలపై సీఎంకు ఎమ్మెల్యే వివరించారు. ఆల్తురుపాడు రిజర్వాయర్ పనులు కూడా జరుగు తున్నట్లు ఎమ్మెల్యే సీఎంకు వివరించారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కావాలని సీఎంను కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో నియోజకవర్గంలో తెలుగుదేశం ఘనవిజయం సాధిస్తుందని సీఎంకు తెలిపారు. ఇంకా పలు అంశాలపై చర్చించారు.

## హత్య కేసులో నిందితులకు...శిక్ష జరిమానా

బాలాయపల్లి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: మండలంలోని హస్త కావేరి గ్రామానికి చెందిన భావనాసి జయచంద్ర హత్య కేసులో కొమ్మల మత్తయ్య, పరిచర్ల బాబ్జాన్ బాబ్జిలకు ఏడు సంవత్సరాల కఠిన కారాగాల, 5000 రూపాయల జరిమానా విధిస్తూ గూడూరు ఏడవ డిస్టిక్ జడ్జి తీర్పు ఇచ్చారు. మండలంలోని హస్త కావేరి గ్రామాలకు చెందిన జయచంద్ర కొమ్మల వెంకటయ్యతో తరచూ గొడవపడుతుండడంతో ఆరు మందిని ఇతర ప్రాంతాల నుంచి రప్పించి కిడ్నాప్ చేసి హతమార్చినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితులకు ఏడు సంవత్సరాలు ఐదేసి వేల రూపాయలు జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు. ఎస్పి సుబ్బరాయుడు, సీఐ రోశయ్య, ఎస్సై సురేష్ బాబు ఈ కేసును ఛేదించి సాక్షాలను కోర్టుకు నివేదించడంతో వారికి జైలు శిక్ష జరిమానా విధించారు.

## మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఇంజనీర్లకు ఆదర్శం

**- బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ డాక్టర్ బిసి నాగరాజ్ - కెఇసిలో ఘనంగా ఇంజనీర్ల దినోత్సవం**



కుప్పం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త : భారత రత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఇంజనీర్లకు ఆదర్శప్రాయులని బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ డాక్టర్ బిసి నాగరాజ్ పేర్కొన్నారు. మంగళవారం కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్‌లో ఇంజనీర్ల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మోక్షగుండం చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మోక్షగుండం త్యాగులు, కృషి, దేశాభివృద్ధికి ఆయన చేసిన నిరంతర ప్రయత్నాలు ప్రతి ఇంజనీరింగ్ విద్యార్థికి స్ఫూర్తిదాయకం కావాలన్నారు. విజ్ఞానం, శ్రద్ధ, అంకితభావంతోనే విద్యార్థులు విజయాలు సాధిస్తారన్నారు. ఎఐ, ఎ ఎంఎల్, రోబోటిక్స్, ఆటోమేషన్, స్టార్ట్ టెక్నాలజీస్, డిటి, సస్టైనబుల్ డెవలప్‌మెంట్ రంగాల్లో ఇంజనీర్లకు విస్తృత అవకాశాలు ఉన్నాయన్నారు. విద్యార్థులు కొత్తఆలోచనలు, ఆవిష్కరణల దిశగా అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ భాస్కరన్, హెచ్ఒడిలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మూడు రోజులుగా ...అంధకారంలో కొత్త కండ్రిగ

**-పండగపూట మంచినీటికి జనం తిప్పలు-శ్మశానంలో దిమ్మె..ఊర్లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్**



తొట్టంబేడు,సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి పట్టణానికి కూత వేటు దూరంలోని తొట్టంబేడు మండలం జ్ఞానమ్మ కండ్రిగ అనే కొత్త కండ్రిగ గ్రామంలోమూడు రోజులుగా విద్యుత్ సరఫరా లేక గ్రామస్తులు తిప్పలు పడుతున్నారు. పండగ పూట కరెంటు లేక మంచినీటి సరఫరాకు అంతరాయమై జనం తిప్పలు పడుతున్నారు. అయితే ఈ సమస్య విద్యుత్ అధికారికి తెలిసినా శాశ్వత పరిష్కారం లేక మంచినీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అయితే గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు నెలల కిందట ట్రాన్స్‌ఫార్మర్ తెచ్చి దించారు.కానీ కాంట్రాక్టర్ అక్కడ పడేసి వెళ్ళాడు. దాని చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగాయి. ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు దిమ్మెను శ్మశానంలో ఏర్పాటు చేసారు. కానీ దానిని గురించి పట్టించుకోవటం లేదు.దాంతో ప్రజల తప్పలు వర్ణనాతీతంగా మారింది.

**మళ్ళీ 3 ఫేస్ విధానాలకే:**

తొట్టంబేడు మండలంలోని కొత్త కండ్రిగ పంచాయతీ వ్యవసాయానికి కేంద్రంగా ఉంది.అంతేకాక ఇటుక రాయి తయారికి కేంద్రంగా ఉంది. అలాంటి గ్రామంలో విద్యుత్ సమస్య చోటు చేసుకుంది.గతంలో ఈ ప్రాంతంలో మూడు ఫేసుల విద్యుత్ సరఫరా ఉండేది. ఈ గ్రామానికి సంబంధించి 100 కెవి ట్రాన్స్‌ఫార్మర్ ఉండేది. దానికి ఎబి స్విచ్ ఏర్పాటు చేసే వారు. ఇక్కడ 23 మోటార్లకు స్విచ్ ఏర్పాటు చేస్తున్నారు.ఏదైనా రిపేర్లు వస్తే ఎబి స్విచ్ బోర్డు ఏర్పాటు చేస్తే ఎక్కడకక్కడ మరమ్మత్తులు చేసుకునే వారు. ప్రస్తుతం సింగల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసారు. ప్రస్తుతం ఇక్కడ రిపేర్లు జరిగితే ఎల్‌సి తీసుకోవాలి.ఎఇకి సమాచారం అందించాలి. సబ్‌స్టేషన్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.ఏదైనా ఒక గ్రామంలో సమస్య ఏర్పడితే ఆ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుంది. అయితే అధికారులు స్పందించాల్సి ఉంది. ఏ ఊరికి ఆ ఊరులో ఎబి స్విచ్ ఏర్పాటు చేస్తే ఆ గ్రామాల వరకే ఇబ్బంది ఏర్పడుతుంది.



## అన్నదానం... మహాదానం

తిరుపతి హెల్త్, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: శ్రీ వినాయక చవితి సందర్భాన్ని పురస్కరించుకొని స్థానిక పెద్ద కాపు లేఔట్‌లో దొడ్డారెడ్డి బ్రదర్స్ దొడ్డారెడ్డి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో స్నేహ బంధం ట్రస్టు వారిచే సుమారు 500 మందికి అన్నదానం నిర్వహించారు. ఢఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దొడ్డారెడ్డి రామకృష్ణారెడ్డి, దొడ్డారెడ్డి ప్రకాష్‌రెడ్డి హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. దొడ్డారెడ్డి రామకృష్ణారెడ్డి, దొడ్డా రెడ్డి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ అన్ని దానాల్లో కన్నా అన్నదానం మిన్న అన్నారు. అంతేకాకుండా ప్రతి ఒక్కరి కష్టాలు పోవాలంటే వినాయకుడిని పూజించాలని పిలుపునిచ్చారు.

# వాడ వాడల్లో ఆకట్టుకుంటున్న వి'నాయకులు'

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:





పుణ్యక్షేత్రంలో చవితి సంబరాలు ఆకట్టుకుంటున్నాయి. సాధారణంగా వినాయక చవితి సంబరాలను ఇక్కడ 5 నుంచి 11 రోజులు నిర్వహించటం ఆనవాయితిగా మారింది. 1994 నుంచి బేరివారి మండపం వద్ద లోక కళ్యాణార్థం చవితి సంబరాలను నిర్వహిస్తూ హోమాలు ఏర్పాటు చేస్తున్నారు. నాలుగుమాడావీధుల్లో పట్టణ నిర్మాణం ఎప్పుడు జరిగిందో అప్పుటి నుంచి నాలుగు మాడావీధుల్లో నవసంధి వినాయకులను ఏర్పాటు చేసారు. రాజకీయ నాయకులు శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి, బిజెపి నాయకుడు కోలా ఆనంద్‌కుమార్, మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి వినాయకులను దర్శించుకున్నారు. పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాల్లో యువకులు సంప్రదాయాలకు అనుగుణంగా ఉట్టి కొట్టే కార్యక్రమాల్ని కన్నుల పండువగా నిర్వహించారు. శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో వినాయక చవితి ఉత్సవాలు నిర్వాహకులు స్వారాల్లో పోటీలు పడి ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసారు. పట్టణ నలుమూలల్లో సుమారు 200కు పైగా పొట్ట విగ్రహాలను ఏర్పాటు చేసారు. ఇక అలంకారాలు కార్యక్రమాల నిర్వాహణలోనూ పోటీలు పడుతున్నారు. కొందరు సోమవారమే నిమజ్జనం జరిపారు. ముఖ్యంగా పట్టణంలోని బేరివారి మండపం వద్ద, పెండ్లిమండపం నిర్వాహకులు పోటీలు పడి కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నారు. ఇక ముత్యాలమ్మగుడి ఆలయం ఎదురుగా సంతమైదానం, ప్రసన్న వరదరాజస్వామి రోడ్డు, గాంధీవీధి, బాబూ అగ్రహారం కోనేరు సమీపంలో, ఓటేరు కాలువ, హరహరబావి వద్ద, కొత్త పేట, పానగల్ పరిసరాల్లో భారీ విగ్రహాలను ఏర్పాటు చేసారు. సాయంత్రం అయితే ఇక్కడ సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు యువకులు రికార్డింగ్ డాన్సులు నిర్వహించుకుంటున్నారు. ఇక ప్రతి రోజూ ఇక్కడ పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలను వితరణ చేస్తున్నారు. ఇక నిమజ్జనం కోసం యువకులు భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు.

## డాక్టర్ హర్షవర్ధన్‌కి కమల పత్ర అవార్డు



తిరుపతి, సెప్టెంబర్ 15ప్రభాతవార్త: సామాజిక కార్యకర్త, జాతీయ శిక్షకుడు డాక్టర్ ఎన్.బి. హర్షవర్ధన్ రెడ్డికి ప్రతిష్ఠాత్మక కమల పత్ర అవార్డు లభించింది. మంగళవారం రాత్రి తిరుపతిలో జరిగిన జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ (జెసీఐ) గ్రేట్ డే వేడుకల్లో ఆయనకు ఈ పురస్కారాన్ని అందజేశారు. సమాజ సేవ, యువత ప్రోత్సాహం, శిక్షణ రంగాల్లో అందిస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ అవార్డును ప్రదానం చేశారు. జూనియర్ జేసీ తిరుపతి చాప్టర్ అధ్యక్షుడి స్థాయి నుల్లు జెసిఐ జోన్ అధ్యక్షుడు, జాతీయ ఉపాధ్యక్షుడు, అంతర్జాతీయ డైరెక్టర్ స్థాయికి హర్షవర్ధన్ రెడ్డి ఎదిగారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పలు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. విద్యారంగంలోనూ ఆయన విశేష ప్రతిభ కనబరిచారు. క్రీడారంగంలోనూ హర్షవర్ధన్ రెడ్డి ప్రతిభ కనబరిచారు. టెన్నిస్, స్కేటింగ్, టెక్వాండో, రోలర్ హాకీ, బ్యాడ్మింటన్, స్కేట్‌బాల్ వంటి క్రీడల్లో జాతీయ స్థాయిలో ప్రతిభ ప్రదర్శించారు. విదేశాల్లో 25కుపైగా దేశాలను సందర్శించి విద్యార్థులు, యువత, ఉద్యోగులకు వివిధ అంశాలపై శిక్షణ అందించారు. పేద విద్యార్థులకు ఉచిత శిక్షణ, రక్తదాన శిబిరాలు, స్వచ్ఛ భారత్, మహిళా సాధికారత వంటి పలు సామాజిక కార్యక్రమాల్లో ఆయన చురుకుగా పాల్గొంటున్నారు. గతంలో శక్తి ఆచార్య నేషనల్ అవార్డు, విశిష్ట సేవా శిరోమణి, గ్లోబల్ ఎక్సలెన్స్, మదర్ థెరిసా, ఇందిరా ప్రియదర్శిని తదితర అవార్డులను అందుకున్నారు. కమల పత్ర అవార్డు అందుకున్న సందర్భంగా పలువురు ప్రముఖులు, జెసీఐ ప్రతినిధులు డాక్టర్ ఎన్.బి. హర్షవర్ధన్ రెడ్డిని అభినందించారు.

## నగరపాలక సంస్థలో ఘనంగా చవితి వేడుకలు



తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యాలయం ఆవరణంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయక ప్రతిమకు కమిషనర్ ఎం.జయకృష్ణ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నాలకు అధిపతి అయినా గణనాదుడి ఆశీస్సులతో అందరి జీవితాలు చల్లగా ఉండాలని స్వామివారిని ప్రార్తించారు. అందరికీ స్వామివారి ప్రసాదాలు పంపిణీ చేశారు. వినాయక చవితి వేడుకల్లో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ శారదా దేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవిన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, మేనేజర్ హాసిమ్, వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్, కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## యస్‌యంసి ఎన్నికల షెడ్యూల్ విడుదల

నింద్ర, సప్టెంబరు 15 ప్రభాతవార్త : పాఠశాల యాజమాన్యం కమిటీల పునర్వ్యవస్థీకరణ ఎన్నికల షెడ్యూలు మంగళవారం ప్రభుత్వం విడుదల చేసింది. మంగళవారం మండల విద్యాశాఖాధికారి శ్రీధర్‌రాజు విలేకర్లు సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన యస్‌యంసి మార్గదర్శకాలు 2026 ఆధారంగా రాష్ట్రంలోని పాఠశాల యాజమాన్య కమిటీల యస్‌యంసి పునర్వ్యవస్థీకరణ ఎన్నికలు నిర్వహించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరక్టర్ బి.శ్రీనివాసరావు తెలిపినట్లు తెలిపారు. సప్టెంబరు 15వతేది యస్‌యంసి చైర్‌పర్సన్,వైస్ చైర్ పర్సన్ ఎన్నికల నోటిపికేషన్ విడుదల,18వ తేది నోటీసుబోర్డుపై ఓటర్లు జాబితా ప్రదర్శన,25వతేది అభ్యంతరాలు స్వీకరణ, ప్రదర్శన,సప్టెంబరు 29తేదిన ఎన్నికలు నిర్వహణ జరుగుతుందని తెలిపారు.

## బీసీల ఆత్మీయ నేత బాలాజీకి ఘన స్వాగతం

**శ్రీకాళహస్తి రూరల్,సెప్టెంబర్ 15 ప్రభాతవార్త** : బీసీల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న ఆంధ్రప్రదేశ్ బ్యాక్ వర్డ్ క్లాస్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వడ్లతంగల్ బాలాజీప్రసాద్ రెడ్డికి శ్రీకాళహస్తి టీఎంవీ కాలనీలో పండుగ శోభ సంతరించుకుంది. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని టీఎంవీ కాలనీ ప్రజలు, యువత ఆయనకు ముందస్తు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆత్మీయంగా పలకరింపులు కొనసాగించారు కేవలం పదవులకే పరిమితం కాకుండా నిత్యం ప్రజల్లో ఉంటూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల సమస్యలపై గళం విప్పుతున్న బాలాజీ ప్రసాద్‌రెడ్డికి ప్రజల్లో విశేష ఆదరణ ఉంది. అందుకే శ్రీకాళహస్తి నియోజకవర్గ వ్యాప్తంగా ఏ పండుగ వచ్చినా ముందుగా గుర్తుకు వచ్చే పేరు ఆయనదే అని కాలనీ వాసులు తెలిపారు. ఈ సందర్భంగా బాలాజీ ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ విఘ్నాలు తొలగించే వినాయకుడు రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సుఖ సంతోషాలు, అష్టైశ్వర్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు. బీసీల ఐక్యతే తమ బలమని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు టి యం వి కాలనీకి చెందిన వినాయక, బాలాజీ, సుబ్రహ్మణ్యం, రమేష్, విజయ్, మహేష్, గౌరి తదితరులు పాల్గొన్నారు.

## పండగలు సంప్రదాయాలకు నిలయాలు



శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: పండగలు మన సంప్రదాయాలు, సంస్కృతికి నిదర్శనమని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. వినాయక చవితి సందర్భంగా ఆయన సతీసమేతంగా స్వామి అమ్మవార్ల సేవలో పాల్గొన్నారు. అలాగే బేరి వారి మండపం వద్ద బిజెపి ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ సారథ్యంలో నిర్వహిస్తున్న వినాయక చవితి సంబరాల్లో కలసి పాల్గొన్నారు. అలాగే పండగ రోజు శివభక్తులు ఆలయాధికారులతో కలసి శివయ్య ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులతో కలసి భోజనం చేసారు. పట్టణంలోని నాలుగుమాడావీధుల్లో వెలసిన నవసంధి వినాయకులకు 'సారె అందించే' కార్యక్రమాల్లో రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయం గత కొన్ని సంవత్సరాలుగా నవసంధి వినాయకులకు సంప్రదాయబద్దంగా సారె అందించే కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఆలయంలోని అలంకార మండపం వద్ద ఆలయ ఇఓ బికె వెంకటేశులు పర్యవేక్షణలో వేదపండితులు వేద మంత్రాల్ని పఠిస్తుండగా ఆలయ ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్, సంబంధం గురుకుల్‌లు వెంటరాగా సారె ఊరేగింపుగా తీసుకెళ్లి ఆలయాల వద్ద అర్చకులకు అందించి అలంకరించారు. ఈసందర్భంగా శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ నేడు పాశ్చాత్య మోజులో యువత మన సంప్రదా యాల్ని, సంస్కృతిని మరచి వ్యవహారిస్తున్నారన్నారు. ఇఓతో పాటు ఎఇఓ లోకేష్‌రెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, టెంపుల్ పర్యవేక్షకుడు నాగభూషణం యాదవ్,టెంపుల్ ఇన్స్పెక్టర్ హరియాదవ్ దేవాలయం సిబ్బద్ది తదితరులు హాజరు కాగా వేదమంత్రాలతో మేళ తాళాలు మంగళవాయిద్యాలతో సారెను నాలుగుమాడావీధుల్లోని వినాయక ఆలయాల వద్ద సమర్పించారు.

## గిరిజనవాడల్లో గాలి బ్రదర్స్ అన్నదానం



తొట్టంబేడు సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: వినాయక చవితి పండుగను కొందరు ఆర్భాటంగా జరుపుకుంటే, మరికొందరు పేదవాడి ఆకలి తీర్చి పండుగకు సార్థకత చేకూర్చారు. తొట్టంబేడు మండలంలోని మారుమూల గిరిజన కాలనీలైన ఇలగునూరు, రౌతుసూరమాల పంచాయతీల పరిధిలోని ఎస్టీ కాలనీ వాసులకు గాలి బ్రదర్స్ ఆధ్వర్యంలో సేవ కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ మండల అధ్యక్షులు, మాజీ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాలి మురళి నాయుడు, గాలి చలపతి నాయుడు అన్నదానం నిర్వహించి పెద్ద మనసు చాటుకున్నారు. వినాయక చవితి పర్వదినం సందర్భంగా రెండు పంచాయతీల పరిధిలోని వందలాది మంది గిరిజన కుటుంబాలకు కడుపు నిండా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఇలగునూరు మాజీ సర్పంచ్ మధునాయుడు, లక్ష్మయ్య, శివ, ముత్యాలయ్య తదితరులు పాల్గొన్నారు

## సైకిల్‌పై ఆధ్యాత్మిక యాత్ర

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:**

ఎలాంటి బృందం,స్పాన్సర్లు ప్రత్యేక సౌకర్యాలు లేకుండా కేవలం సొంత ఖర్చులతోనే ఈ యాత్రను కొనాసాగిస్తున్నాడు శ్రీకాళహస్తికి చెందిన ఓ యువకుడు. అతని పేరు కె.విద్యసాగర్. ఇతను ఆంధ్రప్రదేశ్,తమిళనాడు,కర్ణాటక రాష్ట్రాలోనే ప్రముఖ శైవక్షేత్రాలను ఇప్పటికే దర్శించుకున్నాడు. ఈ సందర్భంగా ఇతను మాట్లాడుతూ ఆధ్యాత్మికతో పాటు ఆరోగ్యం,సాహసం,పర్యావరణ పరిరక్షణపై యువతలో ఆసక్తి పెంచడమే తన లక్ష్యమన్నారు.

## దళితులుకు ఆలయ ప్రవేశం కల్పించండి



తొట్టంబేడు, సెప్టెంబర్ 15 ప్రభాత వార్త: తొట్టంబేడు మండలంలోని చియ్యవరం దళితులకు పోలేరమ్మ జాతరలో ఆలయ ప్రవేశం కల్పించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐఎం శ్రీకాళహస్తి ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి మాట్లాడుతూ ఈ నెల 24న చియ్యవరంలో పోలేరమ్మ జాతర నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని ఈ మేరకు జాతర చాటింపులో దళితులు జాతరలో పనులు మాత్రమే చేయాలని, పూజ నిర్వహించకూడదని హుకుం జారీచేశారు. ఆలయ ప్రవేశం కల్పించిన విషయాన్ని నాయకులు ఆర్‌డిఓ భాను ప్రకాష్‌రెడ్డికి వివరించారు.

## పోషకాహారమే సంపూర్ణ ఆరోగ్యానికి మూలం

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:**



పోషకాలతో కూడిన సమతుల్య ఆహారం తీసుకోవడం వల్లనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఐసిడిఎస్ సూపర్వైజర్ భాగ్యలక్ష్మి అన్నారు. శ్రీకాళహస్తి పురపాలక సంఘం పరిధిలోని ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషణ్ మాసం 2026 కార్యక్రమంలో భాగంగా మంగళవారం తుఫాన్ నగర్ అంగన్వాడీ కేంద్రంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సూపర్వైజర్ భాగ్యలక్ష్మి గర్భవతులు, బాలింతలు మరియు తల్లులకు పోషకాహారం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. పౌష్టికాహారాన్ని వృధా చేయకుండా పిల్లలకు క్రమం తప్పకుండా అందించాలని సూచించారు. తుఫాన్ నగర్, లోబావి అంగన్వాడీ కార్యకర్తలు స్వరాజ్యలక్ష్మి, అరుణ, హెల్పర్లు పాల్గొన్నారు.

## మరుగుదొడ్డికి వెళ్తుండగా వ్యక్తిపై కత్తితో దాడి



కుప్పం,సెప్టెంబర్ 15 ప్రభాతవార్త : మున్సిపల్ పరిధి అనిమిగానిపల్లి గ్రామంలో ఓ వ్యక్తి మరుగుదొడ్డికి వెళ్తుండగా మార్గమధ్యంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి అతనిపై రాయి ఆపై కత్తితో దాడి చేసి గాయపరచిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. కుటుంబీకులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా.. గ్రామంలో వెంకటేష్ కుటు ంబ సభ్యులు ఉంటున్నారు. మంగళవారం ఉదయం 6గంటల ప్రాంతంతో వెంకటేష్ మరుగుదొడ్డికై గ్రామ సమీపంలో వెళ్తుండగా ఓ గుర్తు తెలియని వ్యక్తి వచ్చి రాతితో అతన్ని కొట్టి ఆపై కత్తితో మెడపై దాడి చేశాడు. దీంతో వెంకటేష్‌కు రక్త స్రావం కాగా వెంటనే అతను కేకలు వేయడంతో గుర్తు తెలియని వ ్యక్తి పరారయ్యాడు. బాధితుడ్ని కుటుంబీకులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

## భారతదేశ గర్వించదగ్గ ఇంజనీరు...మోక్షగుండం విశ్వేశ్వరయ్య



తిరుపతి,సెప్టెంబర్ 15ప్రభాతవార్త: ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో ఇంజనీర్స్ పాత్ర ప్రముఖమైనదని బిజెపి నాయకులు అన్నారు. ఇంజనీర్స్ డే ని పురస్కరించుకుని తిరుపతిలో ఆ పార్టీ నాయకులు కలసి మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. భారతదేశ గర్వించదగ్గ ప్రఖ్యాత ఇంజనీరు మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని గుర్తుగా నేడు మనం ఇంజనీర్స్ డే ని జరుపుకుంటున్నామని వివరించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య కు తిరుపతికి ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. తిరుమలకు ఘాట్ రోడ్ నిర్మాణం జరిగిందని గుర్తు చేసారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య సారథ్యంలో దేశంలో అనేక వంతెనలు, డ్యామ్ లు ప్రముఖ కట్టడాల నిర్మించబడ్డాయన్నారు. ఈ సందర్భంగా తిరుప తిలో ఇంజనీర్లు కట్టమంచి చంద్రబాబు యాదవ్, ఆదం అనిల్ రెడ్డి, భాగవతులు శ్రీనివాసులను సత్కరించి ఇంజనీర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో బిజెపి నాయకులు గుండాల గోపీనాథ్‌రెడ్డి, కట్టమంచి చంద్రబాబు యాదవ్, రమేష్ బాబు, భవాని శంకర్, తిరుపతి బిజెపి నార్త్ మండల అధ్యక్షులు లోక ప్రభాకర్ నాయుడు, పాల్గొన్నారు.

## తిరుపతి లో వైభవంగా...గణేష్ నవరాత్రి ఉత్సవాలు

తిరుపతి,సెప్టెంబర్ 15ప్రభాతవార్త: తిరుపతి నగరంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. స్థానిక తుడా రోడ్డు వినాయక నగర్ కట్టపైన వెలసిన వరసిద్ధి వినాయక స్వామి దేవాలయంలో చవితి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. మంగళవారం మధ్యాహ్నం దాదాపు వెయ్యి మంది భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిధులుగా రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, ఆలయ నిర్వాహకులు వాసు,పద్మావతి, ముని కృష్ణారెడ్డి, కసవనూరు వాసు, నాగేశ్వర్ రెడ్డి, భాస్కరాచారి, మోహన్ రెడ్డి, తిరుపాలాచారి, మురళి, తొండం నాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, ఎం దొరై కన్నయ్య,రామకృష్ణారెడ్డి సాయి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.



# తిరుపతి డివిజన్

## మళ్లీ కుప్పానికి కృష్ణాజలాలు

– సీఎం చంద్రబాబు చొరవ.. బి.కొత్తకోట దాటిన నీళ్లు !!

**కుప్పం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:** కుప్పం నియోజకవర్గానికి మరలా శ్రీశైలం నుంచి కృష్ణాజలాలు అందించాలని సిఎం చంద్రబాబునాయుడు చొరవ తీసుకున్నారు. శ్రీశైలం బ్యాక్ వాటర్‌నుంచి కృష్ణాజలాలను అనంతపురం జిల్లా మీదుగా కుప్పానికి మళ్లీ చేరేందుకు ఆదేశించారు. దీంతో జలవనరుల శాఖ అధికారులు కృష్ణాజలాలను విడుదల చేశారు. ప్రస్తుతం కృష్ణాజలాలు అనంతపురం జిల్లా దాటి తంబళ్ల పల్లి నియోజకవర్గం బి.కొత్తకోట దాటాయి. దీంతో కుప్పం ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## జిల్లా ఎస్పీచే సిఎం పర్యటన ప్రాంతాలు పరిశీలన

**కుప్పం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త :** సిఎం చంద్రబాబునాయుడు ఈనెల 21,22 తేదీల్లో కుప్పంలో పర్యటించనున్న నేపథ్యంలో మంగళవారం జిల్లా ఎస్పీ తుషార్ డూడీ సిఎం పర్యటన ప్రాంతాలను పరిశీలి ంచారు. భ ద్రత ఏర్పాట్లు, బందోబస్తు విధులు, హెలిప్యాడ్, వాహనాల రాకపోకలు, పార్కింగ్, వేదిక తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వక పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రతి పోలీసు అధికారి సిఎం పర్యటనలో తమకు అప్పగించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలన్నారు. అనంతరం కుప్పం ఎఎస్పీగా బాధ్యతలు చేపట్టిన బొడ్డు హేమంత్‌కు శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, మెరుగైన పోలీసు సేవలు, ముఖ్యమైన కేసుల పర్యవేక్షణ అంశాలపై దిశానిర్దేశం చేశారు.

## ఈతకు వెళ్లి తిరిగిరాని వ్యక్తి .. పోలీసుల గాలింపు

**శాంతిపురం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త :** స్నేహితుడితో కలసి వినాయక చవితి పండగకు వచ్చిన ఓ వ్యక్తి ఈతకు దిగి తిరిగిరాకుండా పోయిన సంఘటన కారుముట్ల గొల్లపల్లి గ్రామం వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా.. గ్రామానికి చెందిన మనోహర్ బెంగళూరులో జీవనోపాధి పొందుతున్నాడు. ఇతని స్నేహితుడు ముబారక్ (23) సైతం వినాయక చవితి పండగకు కారుముట్ల గొల్లపల్లికి వచ్చాడు. కాగా మిత్రులంతా కలసి గ్రామ సమీపంలో క్వారీ గుంత వద్ద చిన్న ఫంక్షన్ నిర్వహిం చుకున్నారని కాగా ఇదే సమయంలో ముబారక్ దుస్తులు తీసి గట్టుపై ఉంచి నీటిలో దిగాడ న్నారు. అయితే ఎంతసేపటికీ అతను తిరిగి రాలేదు. దీంతో పోలీసులకు సమాచారం అందించగా పోలీ సులు, ఫైర్ సిబ ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. రాళ్లబూదుగూరు ఎస్సై నరేష్ కేసు నమోదు చేశారు.

## షార్ట్ సర్క్యూట్‌తో కాలిన ఇల్లు!



**శాంతిపురం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త :** మండలంలోని మొరసనపల్లి గ్రామంకు చెందిన రామచం ద్రప్ప ఇల్లు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో కాలిపోయిన సంఘటన మంగళవారం జరిగింది. రామచంద్రప్ప కూలీపనుల నిమిత్తం వెళ్లి తిరిగి వచ ్చి చూడగా ఇల్లు దగ్ధమై ఉంది. ఇంట్లోని 5లక్షల నగదు, 30గ్రాముల బంగారం, భూమి పాస్ పుస్తకాలు, దుస్తులు, రేషన్, ఆధార్, తన కుమారుడి సర్టిఫికెట్లు, బీరువా తదితరాలు కాలిపోయాయన్నారు. తమకు పక్కా ఇల్లు మంజూరు చేయడంతో పాటు తమ కుటుంబాన్ని ఆదుకోవాలని రామచంద్రప్ప రెస్కో ఎండికి వినతిపత్రం అందించాడు.

## ఎఎస్పీని కలసిన మున్సిపల్ కమీషనర్

కుప్పం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: కుప్పం ఎఎస్పీ బొడ్డు ప్రశాంత్‌ను మంళవారం సాయంత్రం కుప ్పం మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఎఎస్పీని కమీషనర్ దుశ్శాలువలతో సత్కరించారు.

## ఘనంగా సోమవారోత్సవాలు ప్రారంభం

**రామకుప్పం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:** స్థానిక శ్రీ సుబ్రమణ్యస్వామి ఆలయంలో సోమవారోత్సవాలు ఘన ంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా భక్తులు శ్రీవెంకటేశ్వరస్వామి, శనీశ్వరస్వామి, నక్షత్రవనం తదితర చోట్ల ప్రత్యేక పూజలు చేశారు. కర్ణాటక, తమిళనాడునుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఐదు వారాలపాటు ఈ ఉత్సవాలు జరుగుతాయి. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం జరిపారు.

## పంటలపై ఒంటరి ఏనుగు దాడి

**రామకుప్పం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:** మండలంలోని ననియాల, ననియాల తాండా గ్రామ శివార్లలో రైతులు కామరాజు నాయక్, సింగారవేలు సాగు చేస్తున్న వరి, పశుగ్రాసాన్ని ఒంటరి ఏనుగు ధ్వంసం చేసింది. దీంతో పాటు వ్యవసాయ పరికరాలు తొక్కేసింది. చీకటి పడితే ఒంటరి ఏనుగు గ్రామాల్లో పంటలపై దాడులు చేసో ్తంది. ననియాల అటవీ ప్రాంతంలోని కనుములు ప్రాంతంలో ఒంటరి ఏనుగు మకాం పెట్టినట్లు అటవీ అధికారులు పేర్కొన్నారు. రైతులు ఎవరూ రాత్రిపూట పొలాల వద్దకు వెళ్లరాదని హెచ్చరించారు.

## చీటీల సొమ్ముతో పరారీపై...పోలీసులకు ఫిర్యాదు



రామకుప్పం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: వి.కోట మండలం పాతూరుకు చెందిన సతీష్ గత కొన్నేళ్లుగా చీటీ వ్యాపారాలు నిర్వహించుకుంటూ తమ నగదుతో పరారైనట్లు బాధితులు రామకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పలువురు రైతులు, వ్యాపారులనుంచి లక్షల కొద్దీ చీటీల నగదు కట్టించుకుని సతీష్ నెలరోజుల క్రితం పరారయ్యాడని తెలిపారు. ఇతను వి.కోట, రామకుప్పం మండలాల్లో కోట్ల రూపాయల మేర చీటీల సొమ్ము చెల్లించాల్సి ఉండగా పరారయ్యాడని తమకు న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

## మున్సిపల్ చైర్మన్‌చే అన్నక్యాంటీన్ తనిఖీ



**కుప్పం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:** స్థానిక అన్నక్యాంటీన్‌ను మంగళవారం మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా ప్రజలకు అందిస్తున్న ఆహారంను పరిశీలించారు. 5రూ.లకే భోజనం అందించడం పట్ల ప్రజలతో మాట్లాడి వారి అభిప్రాయం తెలుసుకున్నారు. ప్రజలు తమకు తక్కువ ధరకే రుచికరమైన ఆహారం అందించడం పట్ల సిఎం చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, కార్పోరేషన్ డైరెక్టర్ వేణుగోపాల్, నేతలు సత్యేంద్రశేఖర్, దేవా, లోకేష్, జాలు, రాజా పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక

**గుడుపల్లె, సెప్టెంబర్ 15ప్రభాతవార్త:** మండలంలోని గుత్తార్లపల్లి జడ్పీ హైస్కూల్‌లో చదివిన మీనా జాతీయ స్థాయిలో ఇన్‌స్పైర్ మనక్ కార్యక్రమంకు ఎంపికైంది. మీనా ఫియర్ లెస్ గాడ్ ఎంపవరింగ్ ఉమెన్ సేఫ్టీ విత్ జిపిఎస్ ఎనేబుల్డ్ ఎలక్ట్రిక్ షాక్ ప్రాజెక్టు చేసి జాతీయ స్థాయికి ఎంపికైంది. మీనా, గైడ్ టీచర్ సుజాతను హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు అభినందించారు.

## విన్నాయకున్ని సేవలో రేణిగుంట డిఎస్పీ



రేణిగుంట, సెప్టెంబరు 15 ప్రభాతవార్త: వినాయక చవితిని పురస్కరించుకుని శ్రీ వరసిద్ధి వినాయక టాక్సీ ఓనర్స్ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రేణిగుంట రైల్వే స్టేషన్ సమీపంలో సోమవారం అన్నసంతర్పణ నిర్వహించారు. గత పదేళ్లుగా ప్రతి ఏటా వినాయక చవితికి కొనసాగిస్తున్న ఈ సేవా కార్యక్రమంలో ఈ ఏడాది కూడా వెయ్యి మందికి పైగా భక్తులు, ప్రయాణికులకు అన్నప్రసాదం వడ్డించారు. యూనియన్ అధ్యక్షుడు ఎం. షంషీర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసరావు పాల్గొని అన్నప్రసాదాన్ని భక్తులకు సహపంక్తి రూపంలో వడ్డించారు. వినాయక చవితి సందర్భంగా రైల్వే స్టేషన్ పరిసరాల్లో భక్తులు, ప్రయాణికుల రద్దీ అధికంగా ఉండటంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఆహార సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఏటా సుమారు 200 కిలోల బియ్యం వినియోగించి అన్నప్రసాదాన్ని పంపిణీ చేస్తున్నామని, భవిష్యత్తులో సేవలను కచ్చితంగా కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అర్బన్ సీఐ జయచంద్ర పుర ప్రముఖులు గోపాల కృష్ణ (శీను) మురళి రాయల్, ఎస్. మొహమ్మద్ షరీఫ్, పార్థసారథి, మహేష్, ఎస్.జి. ప్రకాష్, మల్లి, ఇనాయతుల్లా, నూరుల్లా, క్రరీ రాజా, అమిత్ బచ్చన్, ఫైజుల్లా, విలియమ్స్, జియావుద్దీన్, సమీర్ ఖాన్, జావీద్, అక్బర్, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

## బొజ్జ గణపయ్యల సేవలో రిషితారెడ్డి



రేణిగుంట, సెప్టెంబరు 15 ప్రభాతవార్త: రేణిగుంట పట్టణం గణనాథుని నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బొజ్జల రిషితారెడ్డి మంగళవారం పట్టణంలోని పలు వినాయక మండపాలను సందర్శించి విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషాతో కలిసి పలు ప్రాంతాల్లో కొలువుదీరిన గణపయ్యలను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు. రేణిగుంట బస్టాండ్, రిజిస్టర్ ఆఫీస్ సమీపం, జిమ్‌లైన్, గౌరీనగర్, వినాయకనగర్ తదితర ప్రాంతాల్లోని మండపాలను సందర్శించిన రిషితా రెడ్డి అక్కడ జరుగుతున్న అన్న సంతర్పణ నందు పాల్గొని భక్తులకు స్వయంగా అన్నప్రసాదం వడ్డించి గణనాథుని సేవలో భాగస్వామ్య మయ్యారు. నిర్వాహకులు ఆమెకు స్వాగతం పలికి సత్కరించి, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## వైద్య సేవలు ఏరియా ఆసుపత్రి వైస్ చైర్మన్ భాగ్యలక్ష్మి త్రిలోక్

**కుప్పం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త.**



సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు కుప్పం ఏరియా ఆసుపత్రిలో వచ్చే రోగులకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆసుపత్రి వైస్ చైర్మన్ భాగ్యలక్ష్మి త్రిలోక్ పేర్కొన్నారు. సోమవారం రాత్రి ఆమె ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీలను చేపట్టారు .ఈ సందర్భంగా రోగులతో మాట్లాడారు. వైద్యులు, సిబ్బంది అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారని ఆమె పేర్కొన్నారు .

## విఘ్నేశ్వర ధ్యాన యజ్ఞం ప్రారంభం

తవణంపల్లి సెప్టెంబర్ 15 ప్రభాతవార్త : ప్రముఖ పుణ్యక్షేత్రం కానిపాకం సమీపంలోని శ్రీ విఘ్నేశ్వర పిరమిడ్ మహాశక్తి క్షేత్రం లో మూడు రోజులపాటు జరిగే శ్రీ విఘ్నేశ్వర ధ్యానమహాయజ్ఞం మంగళవారం ఘనంగా ప్రారంభమైంది విశ్వ కళ్యాణం విశ్వశాంతి విశ్వ శ్రేయస్సు కోసం ఈ క్షేత్రంలో ఈనెల 15 నుంచి 17 వరకు మూడు రోజులు పాటు ధ్యాన మహా యజ్ఞం జరగనుంది. పిరమిడ్ క్షేత్రం వ్యవస్థాపకులు బి గోపాలకృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఈ యజ్ఞం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా పలువురు ధ్యాన గురువులు మాట్లాడుతూ ధ్యానం వల్ల సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని తెలిపారు, కావున ప్రతిరోజు ధ్యానమును జీవితంలో భాగంగా చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా పిరమిడ్ క్షేత్రం వ్యవస్థాపకులు గోపాలకృష్ణమూర్తి మాట్లాడుతూ మొట్టమొదటిసారిగా ఈ పిరమిడ్ క్షేత్రంలో మూడు రోజులపాటు ధ్యాన యజ్ఞమును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దక్షిణాదిలోని పలు రాష్ట్రాలకు చెందిన ధ్యాన గురువులు భక్తులు పాల్గొంటున్నట్లు తెలిపారు

## నేడు రాజకీయ పార్టీలతో సమావేశం: ఎంపీడివో మోహన్



పెనగలూరు,సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: పెనగలూరు మండలంలో మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీ పోలింగ్ కేంద్రాల డ్రాఫ్ట్ పై, ఓటర్ జాబితాపై రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మోహన్ మంగళవారం ఒక ప్రకటన లో తెలిపారు. పెనగలూరు మండలం లో మొత్తం 11 ఎంపిటిసి స్థానాలు ఉన్నట్లు చెప్పారు. రాజకీయ పార్టీలు ఈ సమావేశం లో పాల్గొని తమ అభ్యంతరాలు తెలియజేయాలని కోరారు.

## పాఠశాల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల



**పెనగలూరు,సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:** పెనగలూరు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైనట్లు ఎంఈఓ1, ఎం.గిరి వరదయ్య, ఎంఈఓ 2, టీ.నాగ సుబ్బరాయుడు ఒక సంయుక్త ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 29న పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికల జరుగుతాయని చెప్పారు. మండల వ్యాప్తంగా 54 ప్రాథమిక పాఠశాలలు, 7 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఒక ఏపీ మోడల్ స్కూల్ పెనగలూరు, ఒక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, ఒక ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పాఠశాల ఉన్నట్లు తెలిపారు. ఈ పాఠశాలలకు యజమాన్య కమిటీ ఎన్నికలు జరుగుతాయని వారు తెలిపారు.

## వినాయక స్వామి పూజలో పాల్గొన్న వైసీపీ నాయకులు



**రైల్వే కోడూరు రూరల్, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:** రైల్వే కోడూరు మండలంలోని జగదం పల్లి నందు మంగళవారం వైసిపి సీనియర్ నాయకులు రామిరెడ్డి ధ్వజారెడ్డి, పుల్లంపేట నాయకులు ముద్ద బాబుల్ రెడ్డి, రైల్వే కోడూర్ నాయకుడు తోట శివ సాయిలు వినాయక స్వామి పూజా కార్యక్రమాల్లో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు అంద చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు దార్ల చంద్రశేఖర్, ఆనాల వంగల్ రెడ్డి, కంభపాటి శ్రీనివాసరెడ్డి, ఆర్వీ రమణ, మైనారిటీ నాయకుల షఫీ, బత్తల సుబ్రహ్మణ్యం, బత్తల మణి, కొ రెడ్డి సిద్దయ్య, బత్తిన ఆనంద్, మల్లు కృష్ణారెడ్డి, గౌతంరెడ్డి, రమణారెడ్డి తోపాటు వైసీపీకి చెందిన సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం మాదే

-టిడిపి ఇన్చార్జ్ ముక్కా రూపానంద రెడ్డి



**రైల్వేకోడూరు రూరల్, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో కూటమి ప్రభుత్వం విజయావుటా ఎగురవేస్తుందని రైల్వేకోడూరు టిడిపి ఇన్చార్జ్ ముక్కా రూపానందరెడ్డి అన్నారు. మంగళవారం రైల్వేకోడూరు మండలంలోని రాఘవ రాజాపురం టిడిపి కార్యాలయం నందు విలేకరులతో మాట్లాడుతూ రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలలో విజయవంతంగా గెలుపును సాధిస్తామని అన్నారు. రాష్ట్రంలో కూటమి పార్టీ రథసారదులైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల సారధ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో అత్యధికంగా గెలుపును మిగిలిపోతుందని అంతే ప్రజలు ఓట్లు వేసే కాలం వెళ్లిపోయింది అని ఆయన అన్నారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో ఐదు మండలాల్లో అందరి సహకారంతో విజయపుటాలు ఎగరవేసేదాని రూపానంద రెడ్డి అన్నారు. అదేవిధంగా వినాయక చవితి సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు సుఖశాంతులు అన్నానని స్వామివారిని కోరుకున్నట్లు ఆయన అన్నారు.

## అక్రమ టపాసుల నిల్వ ,అమ్మకంపై కేసు నమోదు.



**చిట్వేలి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:** టపాసులను అక్రమంగా నిలువ చేసి అమ్ముతున్న ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై వినోద్ కుమార్ తెలిపారు. మంగళవారం తాను మీడియాతో మాట్లాడుతూ చిల్లావాండ్లపల్లె గ్రామం ఉత్తర దిశలోని మామిడి తోటలో అక్రమంగా టపాసులు నిల్వ చేసి విక్రయిస్తున్నట్లు అందిన సమాచారంతో తాము తమ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా మండల పాల సాయి (27), తండ్రి పాలకొండయ్య రాయుడు ను అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి రూ.1,26,510 విలువైన 8 రకాల టపాసులను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.లైసెన్స్ లేకుండా టపాసులు నిల్వ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలడంతో బి.ఎన్.ఎస్ 288, ఎక్స్ ప్లోజివ్ యాక్ట్ 9(బి)(1)(బి) కింద కేసు నమోదు చేసి నిందితుని అరెస్ట్ చేశామన్నారు.లైసెన్స్ లేని వ్యక్తుల వద్ద టపాసులు కొనుగోలు చేయవద్దని, అక్రమ నిల్వలు, విక్రయాలపై తమకు సమాచారం ఇవ్వాలని ఎస్సై వినోద్ కుమార్ ప్రజలకు సూచించారు.

## భక్తిశ్రద్ధలతో వినాయక చవితి వేడుకలు.



**చిట్వేలి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:** మండల వ్యాప్తంగా వినాయక చవితి వేడుకలను సోమవారం ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అన్నీ గ్రామాలు, ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన వినాయక మండపాల్లో పలు రూపాలలో గల గణనాథుడిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హారతులు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.మండపాల వద్ద పిల్లల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అన్న దానాలు పెద్ద ఎత్తున నిర్వహించారు.మండపాల వద్ద నిర్వాహకులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.చిట్వేలి గ్రామంలోని బ్రాహ్మణ వీధి, శ్రీ రామాలయం,గాజుల వీధి, వైయస్సార్ విగ్రహం, ఎన్టీఆర్ నగర్ తదితర ప్రాంగణాలలో మరియు అన్ని గ్రామాల్లో భారీ విగ్రహాలు ఏర్పాటు చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రశాంతంగా వేడుకలు నిర్వహించాలని స్థానిక ఎస్సై వినోద్ కుమార్ కమిటీలకు సూచనలు, ప్రత్యేక తనికీలు, బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బాలాజీ తమ పరిధిలోని మండలాల ప్రజలకు ముందస్తు సూచన చేశారు. పండుగ సందర్భంగా గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## బాణసంచా పేలి 5 మందికి గాయాలు





**బంగారుపాళ్యం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:** వినాయకచవితి పండుగ పురస్కరించుకుని బాణసంచా పేల్చడానికి సిద్ధంగా వున్న సమయంలో ఒక్కసారిగా నిప్పురవ్వలు పడి బాణసంచా పేలింది. ఈ సంఘటనలో ఐదు మంది గాయపడ్డారు. గాయపడిన వారిలో ఇద్దరికి తీవ్రంగా గాయాలు అయ్యాయి. ఈ సంఘటన మండలంలోని కుర్మాయిపల్లి పంచాయతీ రొళ్ళవారిపల్లిలో సోమవారం సాయంత్రం జరిగింది. వినాయకచవితి సందర్భంగా గ్రామస్తులు గ్రామ నడి వీధిలో వినాయక ప్రతిమను ఏర్పాటు చేసి ఘనంగా పూజలు నిర్వహించారు. సాయంత్రం నిమజ్జనం చేయడానికి సన్నాహాలు చేపట్టారు. నిమజ్జనం సమయంలో బాణసంచా పేల్చడానికి సిద్ధంగా వుంచిన బాణసంచా సంచులపై నిప్పురవ్వలు పడటంతో ఒక్కసారిగా బాణసంచా పేలింది. ఆ సమయంలో గ్రామానికి చెందిన జగదీశ్వర్‌రెడ్డి(34), సుగుణ(30), సింధుప్రసాద్ (30), కిషోర్‌కుమార్‌రెడ్డి(32), జయచంద్రారెడ్డి(65)లు గాయపడ్డారు. గాయపడన వారిని వెంటనే చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో ఇద్దరికి తీవ్ర గాయాలకు లోనై చికిత్స పొందుతున్నారు. గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంగారుపాళ్యం సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కత్తి శ్రీనివాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా వినాయకచవితి వేడుకలు

**బంగారుపాళ్యం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:**



వినాయకచవితి వేడుకలను సోమవారం మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో వినాయక మండపాలు ఏర్పాటు చేసి వినాయక మండపాలు వుంచి ఘనంగా పూజలు నిర్వహించారు. పచ్చని తోరణాలతో పందులు వేసి వివిధ పుష్పాలతో అలంకరణ నిర్వహించారు. బంగారుపాళ్యం, తగ్గువారిపల్లి, రాగిమానుపెంట, తుంబకుప్పం, టేకుమంద, మొగలివెంకటగిరి, మొగలి, మహాసముద్రం, కెజి సత్రం, మంగళపల్లి తదితర గ్రామాల్లో వినాయక విగ్రహాలను ప్రతిష్టించి భక్తిశ్రద్దలతో పూజలు నిర్వహించారు. బంగారుపాళ్యం లోని మేదరవీధి, బ్రహ్మణవీధి, బిల్వమాను వీధి, ఓటికె వీధి, నెహ్రు వీధి, దళితవాడల్లో వినాయక విగ్రహాలను పెట్టి పూజలు నిర్వహించారు. ఇందులో మాజీ జడ్పీ ఛైర్మన్ ఎంబి కుమార్‌రాజా, మాజీ సర్పంచ్ ఎంబి కృష్ణమూర్తి, మాజీ ఉప సర్పంచ్ కామరాజు, యువత పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## పజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి

**పులిచెర్ల, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:** పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జ్ వై. మధుసూదన్ నాయుడు రొంపిచెర్ల, పులిచెర్ల మండలాల అధికారులతో జడ్పీ బంగ్లాలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా మండలాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, మోలిక వసతులు, రహదారులు, ప్రజలకు అవసరమైన సదుపాయాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు.ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమస్యలను ప్రాధాన్యత క్రమంలో గుర్తించి, త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తమ ప్రాంతాల్లోని సమస్యలను ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకువస్తే, వాటిని సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం లభించే వరకు నిరంతరం కృషి చేస్తానాని మధుసూదన్ నాయుడు తెలిపారు. ప్రజల పక్షాన నిలబడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం కల్లూరులో పర్యటించిన పుంగనూరు నియోజవర్గం టిడిపి ఇన్చార్జ్ వై మధుసూదన్ నాయుడు సమక్షంలో వైసీపీ నుండి టీడీపిలో చేరడం జరిగినది.

## ఇంజనీర్లు లేకపోతే...భవిష్యత్తు లేదు



రేణిగుంట, సెప్టెంబరు 15, ప్రభాతవార్త: రేణిగుంట మండలం వెంకటాపురం లోని అన్నమాచార్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్‌లో మంగళవారం భారత్ రత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఇంజనీర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.నాదమునిరెడ్డి మాట్లాడుతూ సర్ మోక్షగుండం విశ్వేశ్వ రయ్య దేశానికి అందించిన సేవలను కొనియాడారు. నేటి తరం విద్యార్థులు ఆయనను ఆదర్శంగా తీసుకుని, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడే నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని సూచించారు. మంచి పౌరులుగా ఎదిగి, బాధ్యతాయుతమైన ఇంజనీర్లుగా దేశ ప్రగతికి కృషి చేయాలని ఆకాంక్షించారు. యువ ఇంజనీర్లకు ఇంజనీర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ జే. గురుజవహర్ మాట్లాడుతూ ప్రస్తుత మార్కెట్ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమానికి అన్నమాచార్య యూనివర్సిటీ ఛాన్సలర్, ఏఈటీ వ్యవస్థాపకుడు డాక్టర్ సి. గంగిరెడ్డి, ఏఈటీ జాయింట్ సెక్రటరీ సి. పూజితా రెడ్డి అభినందనలు తెలిపారు. వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు



రేణిగుంట, సెప్టెంబరు 15 ప్రభాతవార్త: వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమా లను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు రేణిగుంట పట్టణం, మండల పరిధిలో రూరల్ పోలీసులు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టారు. తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్ ఆదేశాల మేరకు రేణిగుంట డీఎస్పీ వై. శ్రీనివాసరావు పర్యవేక్షణలో అర్బన్ సీఐ ఎస్. జయచంద్ర, రూరల్ సీఐ మంజునాథరెడ్డి ఆధ్వర్యంలో నిమజ్జన ప్రాంతాల్లో భద్రతా చర్యలను ముమ్మరం చేశారు.అన్నస్వామిపల్లి, కరకంబాడి, వెంకటాపురం గ్రామాల చెరువులతో పాటు ఎల్లమండ్యం చెరువులో నిమజ్జనానికి అవసరమైన సౌకర్యాలను సిద్ధం చేస్తున్నారు. ఏపీఎస్పీడీసీఎల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమేష్ బాబు, ట్రాన్స్‌కో రూరల్ ఏఈ మల్లికార్జున, అర్బన్ ఏఈ పుణ్యకోటి సహకారంతో ప్రత్యేక విద్యుత్ సదుపాయాలు, స్తంభాలు, లైటింగ్ ఏర్పాటు చేస్తున్నారు. ఎల్లమండ్యం చెరువులో విగ్రహాల నిమజ్జనానికి క్రేన్ సదుపాయాన్ని కూడా అందుబాటులోకి తీసుకువస్తున్నారు. రూరల్ సీఐ మంజునాథరెడ్డి, ఎస్సై హరీష్, సిబ్బంది ఎల్లమండ్యం చెరువును పరిశీలించి నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఊరేగింపులో క్రమశిక్షణ పాటిస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడాలని, పిల్లలు, మహిళలు, వృద్ధుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు.

## నగరపాలక సంస్థ ఎన్నికలకు కాంగ్రెస్ సిద్ధం

-అర్బన్ జిల్లా అధ్యక్షుడు గౌడపేర చిట్టిబాబు



**తిరుపతి,సెప్టెంబర్ 15ప్రభాతవార్త:** తిరుపతి నగరపాలక సంస్థ ఎన్నికలు ఎప్పుడు జరిగినా సత్తా చాటడానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని తిరుపతి అర్బన్ జిల్లా అధ్యక్షుడు గౌడపేర చిట్టిబాబు చెప్పారు. మంగళవారం ఎస్ ఎస్ కిడ్స్ ఫంక్షన్ హాల్ లో కాంగ్రెస్ పార్టీ నగర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో త్వరలో జరగనున్న నగరపాలక సంస్థ ఎన్నికలు తిరుపతిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక కూటమిపాలన సాగుతోందని మండిపడ్డారు. గత వైసిపి ప్రభుత్వం నేటి కూటమి ప్రభుత్వం కలసి తిరుపతి ప్రజలను దగా చేశాయన్నారు. ఈ రెండు పార్టీలకు వ్యతిరేకంగా ప్రజలు కాంగ్రెస్కు పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. పార్టీ బలోపేతం దిశగా పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా విద్యార్థులు, యువజనలు, మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు సైతం కాంగ్రెస్ పార్టీ వైపు ఆకర్షితులు అవుతుండటం శుభపరిణామం అన్నారు. పిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దొడ్డారెడ్డి రాంభూపాల్ రెడ్డి,నెల్లూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ మాంగాటి గోపాల్ రెడ్డి,పిసిసి ప్రధాన కార్యదర్శి తమటం వెంకట నరసింహులు ,కోఆర్డినేటర్ కంభంపాటి మురళీకృష్ణ, మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు నన్నే ఖాన్, సీనియర్ నాయకుడు చిత్తూరు శివశంకర్, ఎస్సీ విభాగం రాష్ట్ర నాయకుడు బోయన నరేంద్రబాబు, తిరుపతి నగర కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు నాగరాజు యాదవ్, గొడుగు చింత గోపి, తదితరులు పాల్గొన్నారు.

## పండగ పూట కూడా ప్రజా సమస్యలపైనే సమావేశం

శ్రీకాళహస్తి రూరల్,సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మండలం ఊరందూరు గ్రామంలో పండగ



పూట కూడా ప్రజా ప్రతినిధి బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి ప్రజా సమస్యలపై మమేకమయ్యారు. సోమవారం, మంగళవారం ఊరందూరులోని తన స్వగృహంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని నలుమూలల నుంచి ప్రజలు కదలి వచ్చారు.ఈ సందర్భంగా పలు సమస్యలు ఆయన దృష్టికి వచ్చాయి.ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ అధికారులు ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం చేయోద్దు అని సూచించారు. ప్రజలు ఎంతో నమ్మకంతో తమకు అధికారం కట్టబెట్టారు.వారి అలోచనలకు అనుగుణంగా పని చేయాల్సి ఉంది. మీరు బాగా పని చేస్తే మాకు మంచిపేరు వస్తుందని సుధీర్‌రెడ్డి అధికారులకు సూచించారు. ప్రస్తుతం ప్రభుత్వం కొత్త పెన్షన్లను మంజూరుకు అనుమతించింది.ఏ ఒక్కఅర్హుడు కూడా తనకు పెన్షన్ రాలేదనే అసంతృప్తి చెందరాదని అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో వచ్చిన ప్రజల నుంచి ఎంఎల్ఏ సమస్యలను సావధానంగా విన్నారు.ఈ సమావేశంలో రంగినేని చెంచయ్యనాయుడు, మిన్నలరవి, గుమ్మడి దశరథాచ్చారి తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి కొండల్లో ఎన్‌సీసీ క్యాడెట్ల సాహసయాత్ర

-భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా ఏపీ ట్రెక్-ఐ




తిరుపతి విద్య, సెప్టెంబర్ 15 ప్రభాత వార్త: తిరుపతి కొండలు, పచ్చని ప్రకృతి, ఆధ్యాత్మిక వాతావరణం నడుమ దేశం నలుమూలల నుంచి వచ్చిన ఎన్‌సీసీ క్యాడెట్లు సాహసయాత్రలో పాల్గొంటున్నారు. తిరుపతిలోని ఎన్‌సీసీ నగర్‌లో సెప్టెంబర్ 12 నుంచి 19వ తేదీ వరకు నిర్వహిస్తున్న అఖిల భారత సీనియర్ డివిజన్, జూనియర్ డివిజన్ ట్రెక్కింగ్ యాత్ర ఏపీ ట్రెక్-। ఉత్సాహంగా కొనసాగుతోంది.తిరుపతి ఎన్‌సీసీ గ్రూప్ హెడ్‌క్వార్టర్స్ ఆధ్వర్యంలో 5 ఆంధ్ర గర్ల్స్ బెటాలియన్ ఎన్‌సీసీ ఈ యాత్రను నిర్వహిస్తోంది. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్- తెలంగాణ, తమిళనాడు-పుదుచ్చేరి-అండమాన్ నికోబార్, కర్ణాటక-గోవా, కేరళ-లక్షద్వీప్ డైరెక్టరేట్‌లకు చెందిన 510 మంది క్యాడెట్లు, 15 మంది అసోసియేట్ ఎన్‌సీసీ అధికారులు పాల్గొంటున్నారు. వివిధ ప్రాంతాలు, భిన్న సంస్కృతులకు చెందిన యువత ఒకే వేదికపైకి రావడంతో శిబిరం జాతీయ సమైక్యతకు ప్రతీకగా నిలుస్తోంది. బ్యాచ్‌ల వారీగా తిరుమల, ప్రాంతీయ విజ్ఞాన కేంద్రం, నగరవనం, జంతు ప్రదర్శనశాల తదితర ప్రాంతాలకు ట్రెక్కింగ్ నిర్వహిస్తున్నారు. ప్రకృతి అందాలను ఆస్వాదించడంతోపాటు ఆయా ప్రాంతాల సాంస్కృతిక, శాస్త్రీయ, సహజ వారసత్వాన్ని తెలుసుకునే అవకాశం క్యాడెట్లకు లభిస్తోంది. ట్రెక్కింగ్ ద్వారా శారీరక దారుఢ్యంతోపాటు ఓర్పు, సమయస్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం పెంపొందుతున్నాయి. తిరుపతిలోని ఎస్వీ జూనియర్ కళాశాలలో క్యాడెట్లకు శిబిర కాలంలో వసతి సౌకర్యం కల్పిస్తున్నారు. తిరుపతి ఎన్‌సీసీ గ్రూప్ హెడ్‌క్వార్టర్స్ గ్రూప్ కమాండర్, ట్రెక్ మేనేజర్ కల్నల్ ఎన్.కె. శర్మ సమగ్ర పర్యవేక్షణలో యాత్ర కొనసాగుతోంది. యువతలో సాహస స్ఫూర్తిని పెంపొందిస్తూ దేశం పట్ల బాధ్యత, సేవా భావం, నాయకత్వ లక్షణాలను తీర్చిదిద్దేలా ఏపీ ట్రెక్-। కొనసాగుతోంది. ఈ అఖిల భారత ట్రెక్కింగ్ యాత్ర సెప్టెంబర్ 19న ముగియనుంది.

## యస్‌యంసి ఎన్నికలకు షెడ్యూల్ విడుదల

వరదయ్యపాలెం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు మేరకు ప్రభుత్వ పాఠశాలలో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికల షెడ్యూల్‌ను బుధవారం విడుదల చేశారని మండల విద్యాశాఖాధికారిని జి సరస్వతి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 202627 విద్యాసంవత్సరానికి సంబంధించిన పాఠశాల యాజమాన్య కమిటి ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఈ నెల 15న యస్ యం సి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల, 18వ తేదీన ఓటర్ల జాబితా పాఠశాల నోటీసు బోర్డులో ప్రదర్శించాలని, 25వ తేదీన ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు స్వీకరించి అదే రోజున తుది ఓటర్లు జాబితా ఖరారు చేసి ప్రదర్శించాలి. 29వ తేదీన యస్‌యంసి సభ్యులకు ఎన్నికలు నిర్వహించి అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు నిర్వహించాలని తెలిపారు. రెండవ మండల విద్యాశాఖాధికారి యన్ గున్నయ్య మాట్లాడుతూ పాఠశాల విద్యాశాఖ ఇచ్చిన మార్గదర్శకాలు ప్రకారం ఈ ఎన్నికల ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా నిర్వహించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు.

## 36,757 మంది ఓటర్లు...

**46 పోలింగ్ కేంద్రాల ప్రతిపాదన**

**- పోలింగ్ కేంద్రానికి సగటున 799 మంది ఓటర్లు**

వరదయ్యపాలెం,సెప్టెంబర్ 15 ప్రభాతవార్త : వరదయ్యపాలెం మండల పరిధిలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ కేంద్రాల ప్రతిపాదనలో భాగంగా మొత్తం 36,757 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరి కోసం మొత్తం 46 పోలింగ్ కేంద్రాలను ప్రతిపాదించినట్లు ఎంపీడీఓ విజయమ్మ తెలిపారు. ప్రతిపాదిత 46 పోలింగ్ కేంద్రాల ప్రకారం ఒక్కో పోలింగ్ కేంద్రానికి సగటున 799 మంది ఓటర్లు ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎన్నికల సంఘం గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాల కేటాయింపు జరగడం వల్ల ఎన్నికల సమయంలో ఓటర్లు ఇబ్బందులు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. పోలింగ్ కేంద్రాల తుది జాబితా, ఓటర్ల సంఖ్య, కేంద్రాల వారీగా ఓటర్ల విభజన తదితర అంశాలపై ఎన్నికల అధికారులు తదుపరి ప్రక్రియను చేపట్టనున్నారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఓటర్లకు అవసరమైన మౌలిక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు కల్పించాల్సిన అవసరం ఉంది.

## పోలీస్ గస్తీ పెంచాలని డిమాండ్

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి పట్టణంలో వరుస దొంగతనాలు లారీ



డ్రైవర్లను,స్థానిక రైతులను తీవ్ర భయాందోళనకు గురి చేస్తున్నాయి. ఇటీవలి కాలంలో వ్యవసాయ విద్యుత్ మోటార్లు, ద్విచక్ర వాహనాల చోరీలు జరగగా, ఇప్పుడు దొంగల దృష్టి జాతీయ రహదారిపై పార్కింగ్ చేసే లారీలపై పడింది. నాయుడుపేట -పూతలపట్టు జాతీయ రహదారి పరిధిలోని ఊరందూరు బైపాస్ సమీపంలో అర్ధరాత్రి సమయంలో పార్కింగ్ చేసి ఉన్న లారీల బ్యాటరీలను,డీజిల్ ను దుండగులు చాకచక్యంగా దొంగిలిస్తున్నారు. నిన్న అర్ధరాత్రి ఊరందూరు బైపాస్ హైవేలో ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు పక్కన కొన్ని లారీలు పార్కింగ్ చేసి ఉండగా ఓ లారీలో బ్యాటరీ దొంగతనం జరిగినట్టు డ్రైవర్ లబోదిబోమంటున్నారు. పండుగ సందర్భంగా రాత్రి అక్కడ పార్కింగ్ చేసి ఇంటికి వెళ్లారు.పండగ చూసుకొని మంగళవారం ఉదయం తన విధులకు హాజరు కాగా లారీని స్టార్ట్ చెయ్యగా ఆ లారీ స్టార్ట్ కాకపోవడంతో కిందకు దిగి చూసిన ఆ డ్రైవర్ అవాక్కయ్యారు.లారీ బ్యాటరీని ఎంచక్కా విప్పుకొని దొంగలు దర్జాగా అక్కడే మద్యం సేవించి ఉన్న ఆనవాళ్లు ఉన్నాయి.దూర ప్రాంతాల నుంచి సరుకులు తీసుకువచ్చే లారీ డ్రైవర్లు రాత్రి వేళ అలసటతో హైవే పక్కన వాహనాలను ఆపి కాసేపు విశ్రాంతి తీసుకుంటుంటారు.అదే అదునుగా దొంగలు రెక్కీ నిర్వహించి బ్యాటరీలను ఊడబెరికి తీసుకెళ్తున్నారు. పక్కనే పెట్రోల్ బంకు ఉన్నా, నేషనల్ హైవే సిబ్బంది తిరుగుతున్నా చోరీలు ఆగడం లేదంటే దొంగల తెగువ ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోందని స్థానికులు అంటున్నారు.ఒక బ్యాటరీ విలువ 15 నుంచి 20 వేల రూపాయలు ఉండటంతో డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతున్నారు.డీజిల్ ను కూడా పైపుల ద్వారా తోడేస్తుండటంతో రవాణా రంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ వరుస ఘటనలపై పోలీస్ శాఖ తక్షణమే స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. రాత్రిపూట పెట్రోలింగ్ ను ముమ్మరం చేయాలని, ఊరందూరు బైపాస్, ఊరందరు ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించాలని డిమాండ్ చేస్తున్నారు. హైవేపై సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి,పెట్రోల్ బంకులు,పార్కింగ్ ప్రాంతాల వద్ద పోలీస్ పికెట్ ను ఏర్పాటు చేస్తే దొంగల ఆగడాలకు అడ్డుకట్ట వేయవచ్చని సూచిస్తున్నారు.పోలీస్ ఉన్నతాధికారులు చొరవ తీసుకుని బాధిత లారీ డ్రైవర్లకు భరోసా కల్పించాలని స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఏపీ సీఎంకి స్వాగతం పలికిన రుద్రకోటి సదాశివం

**తిరుపతి హెల్త్, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త :**

తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళవారం తిరుపతికి విచ్చేశారు. అగ్రికల్చరల్ యూనివర్సిటీ వద్ద ఏర్పాటుచేసిన హెలిపాడ్ వద్ద ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయి బ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం సాధర స్వాగతం పలికారు. అనంతరం ముఖ్యమంత్రి తిరుమలకు బయలుదేరి వెళ్లారు.